నేటి కందం- నేటికి అందం

తీరుగ రాష్ట్రములో వ్యా
పారము నభివృద్ధి పరుప బహుమతి నిడుచున్
నారా ను నిర్మలా సీ
తారామను ప్రస్తుతించె దార్శనికునిగాన్ !!

(రాష్ట్రంలో వ్యాపారాన్ని అభివృద్ధి చేసినందుకు గాను ది ఇకనమిక్ టైమ్స్ వారి ప్రతిష్ఠాత్మక ఇకనమిక్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారికి నిర్మలాసీతారామన్ తన చేతుల మీదుగా అందజేస్తూ చంద్రబాబును మంచి దార్శనికునిగా అభివర్ణించారు



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

ఎగ్జిట్ పోల్స్ ఎంత నిజమో
ఎవరు చెప్పగలరు అంతా
పార్టీలకు హైటెన్షన్
పట్టుకుంది ఎందుకింతా
గెలిచేమని ఎందుకిన్ని
గొప్ప గొప్ప సంబరాలు
ఐపోతవి ఓడిపోతే
ఆశలన్ని దిగంబరాలు



-వేల్పుల నారాయణ
9440433475

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 2-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:204 పేజీలు:6 వెల: రూ.1/-

## నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్



హైదరాబాద్, మే1: రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ పొందిన బి. శివధర్ రెడ్డి స్థానంలో ఆయన ఈ అత్యున్నత బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన ఆయనకు మూడు దశాబ్దాలకు పైగా పోలీస్, పరిపాలనా విభాగాల్లో అపారమైన అనుభవం ఉంది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తానని పునరుద్ఘాటించారు. తెలంగాణ పోలీసు బాస్‌గా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్‌కు పలువురు ప్రముఖులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలిపారు.

## ఈనెల 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 745 మందికి కృత్రిమ అవయవాల పంపిణీ

హైదరాబాద్, మే1: నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 745 మంది దివ్యాంగులకు 815 కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సంస్థాన్ ప్రతినిధి అల్కా చౌదరి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సంస్థాన్ హైదరాబాద్ ఆశ్రమ హెడ్ హమేందర్ సింగ్ రావత్, కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం ఇన్‌చార్జి హరి ప్రసాద్ లడ్డా, అభయ్ చౌదరి, ప్రభుతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో అనేక మంది వివిధ ప్రమాదాలు, పుట్టుకతో దివ్యాంగులుగా మారి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

అలాంటి వారిని గుర్తించి వారు సాధారణ జీవితం కొనసాగించేందుకు దశాబ్దాలుగా నారాయణ సేవా సంస్థాన్ కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేస్తూ వస్తోందన్నారు. కృత్రిమ అవయవాల కోసం మూడు నెలల క్రితమే అవసరమైన వారి మెజర్‌మెంట్లు తీసుకున్నామని, 815 మందికి వారి వారికి సరిపోయే విధంగా అందిస్తామన్నారు. అంతేకాకుండా అదనంగా అందించేందుకు ఉదయ్‌పూర్ నుంచి 50 మంది టెక్నిషియన్లు వస్తున్నారని, అవసరమైన వారికి అక్కడికక్కడే కృత్రిమ అవయవాలను సిద్ధం చేసి ఇస్తారన్నారు.

## ముందే చెప్పా.. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుపై రాహుల్ గాంధీ

న్యూ ఢిల్లీ, మే1: దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు శుక్రవారం రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు.

కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు.

'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్‌పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్–డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు.

ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు.

## అందుకే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించను : డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, మే1:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడానికి కారణాన్ని వెల్లడించారు. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరిస్తే తాను లావుగా కనిపిస్తానని, అందుకే బహిరంగ కార్యక్రమాల్లో దానిని ధరించనని ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

కాగా ట్రంప్‌పై పలుమార్లు హత్యాప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఓవల్ కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో ఒక మీడియా ప్రతినిధి ట్రంప్‌ను ప్రశ్నించారు.

తాను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరిస్తే 20 పౌండ్ల బరువు పెరిగినట్లుగా కనిపిస్తానని, ఇది తనకు ఇష్టం ఉండదని ట్రంప్ అన్నారు. దాంతో అక్కడున్న వారంతా నవ్వులు చిందించారు. హత్యాయత్నం నేపథ్యంలో బుల్లెట్ ప్రూఫ్ ధరించడం లాంటి

# భారీగా పెరిగిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర

న్యూఢిల్లీ, మే1:పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఎ ాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది.



### గృహ వినియోగదారులకు ఊరట..

వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది.

### పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పు లేదు

ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు (షెడ్యూల్డ్ కార్యకలాపాలు) ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్(ఏటీఎఫ్) ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

## కమర్షియల్ గ్యాస్ ధర పెంపుపై మంత్రి ఉత్తమ్ సీరియస్..

హైదరాబాద్, మే1: కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపాంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.



ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.కాగా, కమర్షియల్ గ్యాస్ ధరను పెంచుతూ మోదీ సర్కార్ ఈరోజు ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంచింది. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో 19 కేజీల సిలిండర్ ధర రూ.3071.50కి చేరింది. కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు మండిపడు తున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం యథావిధిగా ధరలు పెంచేసిందని ఆగ్రహిస్తున్నాయి. సామాన్యుడి నడ్డి విరిచేలా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

## లారీని ఢీకొన్న కారు.. ఆరుగురు మృతి



హైదరాబాద్, మే1:హైదరాబాద్‌లోని శంషాబాద్ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16 వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం తీవ్రతకు కారు పూర్తిగా దెబ్బతిన్నట్లు సమాచారం.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సూర్యాపేట జిల్లాలో 'మే' నెలంతా పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పీ నరసింహ

నల్గొండ, మే1: శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మే నెల 1వ తేది నుండి 31వ తేదీ వరకు నెల రోజుల వరకు "30 పోలీస్ యాక్ట్" అమల్లో ఉంటుందని ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా అలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసే వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. బాణాసంచా, డీజేలు ఉపయోగించవద్దన్నారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారం.. డీజీపీకి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మే 1: ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టుధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు.

పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను వీ-Walletలో చూపించినా ట్రాఫిక్ పోలీసులు అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ క్రమంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

## రూ.1,745 కోట్ల మాదకద్రవ్యాలు సీజ్



ముంబయి, మే1: దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో భారీ స్థాయిలో మాదకద్రవ్యాలను నార్కోటిక్స్ బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను సీజ్ చేయడం దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించారు. చిన్న ఆధారాన్ని ఆధారంగా చేసుకుని అధికారులు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించగలిగారని ఆయన తెలిపారు.

నార్కోటిక్స్ బ్యూరో అధికారులు పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలుస్తోంది. భారీగా కొకైన్ పట్టుబడడంతో ముంబయిలో డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలపై మరోసారి చర్చ మొదలైంది. ఈ కేసుకు సంబంధించి మరికొందరిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర సంస్థలు మరింత కఠినంగా వ్యవహరిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ.. వివరాలు వెల్లడించిన ఎంపీ అరుణ..



మహబూబ్‌నగర్, మే1: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత తెలంగాణకు తొలిసారి వస్తున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు. మే 10వ తేదీన హైదరాబాద్‌కు ప్రధాని రానున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారని ఎంపీ అరుణ వెల్లడించారు. పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క, సారక్క గిరిజన విశ్వవిద్యాలయం పనులను కూడా ప్రారంభిస్తారని ఎంపీ తెలిపారు.

పాలమూరు జిల్లాలో పలు జాతీయ రహదారుల పనులనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఎంపీ అరుణ వెల్లడించారు. ఈ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని.. తెలంగాణలో ప్రధాని మోదీ తాజా పర్యటన అందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపైనా ఎంపీ స్పందించారు. ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని అరుణ ధీమా వ్యక్తం చేశారు.

## మే డే రోజే ప్రమాదం..ఫార్మా ల్యాబ్‌లో పేలిన రియాక్టర్.. కార్మికులకు గాయాలు



నల్గొండ, మే1:కార్మిక దినోత్సవం రోజున ఫార్మాల్యాబ్‌లో రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లాలోని చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులోని నోష్ ఫార్మా ల్యాబ్ లోని బ్లాక్ 3లో రియాక్టర్ పేలింది బ్లాక్‌లో 9 మంది కార్మికులకు గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఇదే ఫార్మా కంపెనీలో ఏప్రిల్ 9న రెండో బ్లాక్‌లో రియాక్టర్ పేలి ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నెలరోజులు కూడా గడవకుండానే రెండు ప్రమాదాలు జరిగాయని కార్మికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అత్యంత ప్రజాదరణ పొందిన 'హారీ పోట్టర్' నవలలు

## (02 మే "అంతర్జాతీయ హారీ పోట్టర్ దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచ సాహిత్య చరిత్రలో "హారీ పోట్టర్" నవలలు సృష్టించిన ప్రభంజనం అద్భుతం, ఆశ్చర్యకరం. హారీ పోట్టర్ శ్రేణిలో వచ్చిన ఏడు నవలలు ఆబాలగోపాలాన్ని ఒప్పించి మెప్పుపొందడం గొప్ప విషయం. ప్రజాదరణను దృష్టిలో పెట్టుకుని 2012లో యూకె ప్రధాన మంత్రి డెవిడ్ కామరూన్ చొరవతో జె. కె. రౌలింగ్ రచించిన హారీ పోట్టర్ నవలా శ్రేణి పుస్తకాలకు మరింత గౌరవం, ప్రచారం కల్పించడానికి ప్రతి ఏట 02 మే రోజున "అంతర్జాతీయ హారీ పోట్టర్ దినోత్సవం (ఇంటర్నేషనల్ హారా పోట్టర్ డే)" పాటించడం ప్రారంభం అయ్యింది. 1997తో మొదలు 2007 వరకు వరుసగా ఏడు సీరియల్ ఫాంటసీ నవలలు మార్కెట్లోకి రావడం, క్షణాల్లో లక్షల కాపీలు అమ్ముడు పోవడం చకచకా జరిగిపోయాయి. హారీ పోట్టర్ నవలల ప్రభంజనం నేటికీ తగ్గలేదంటేనే ఆ సాహిత్య మహిమ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. హారీ పోట్టర్ నవలలు ఏకంగా 600 మిలియన్ల వరకు అమ్ముడుపోవడం వల్ల గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించి చరిత్ర సృష్టించింది.

### అంతర్జాతీయ హారీ పోట్టర్ దినోత్సవం :

02 మే 1998న జరిగిన "బ్యాటిల్ ఆఫ్ హోగార్ట్స్"కు నివాళిగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 02 మే రోజున అంతర్జాతీయ హారీ పోట్టర్ దినోత్సవం సందర్భంగా ఆ నవలల్లోని పాత్రలకు అనుగుణంగా వేషాలు వేయడం, సంబరాలు చేసుకోవడం, హారీ పోట్టర్ పుస్తకాలు మరో సారి చదవడం, హారీ పోట్టర్ సినిమాలను చూడడం, పుస్తక దుకాణాలు/గ్రంథాలయాలు/అభిమాన సంఘాలు హారీ పోట్టర్ ఆధారిత పోటీలను నిర్వహించడం జరుగుతున్నది. హారీ పోట్టర్ కల్పిత కథలోని పాత్రలను గుర్తు చేసుకుంటూ మరథాన్‌లు నిర్వహించడం వరకు తమ అభిమానాన్ని, ప్రేమను వ్యక్తం చేయడం నేటికీ కొనసాగుతున్నది.

### రచయిత్రి జె. కె. రౌలింగ్ సాహిత్య సృజన:

రచయిత్రి జొఅన్నె రౌలింగ్ సాధారణ కలం పేరు జె. కె. రౌలింగ్ ఒక గొప్ప సాహితీవేత్తగానే కాకుండా దాతృత్వం కలిగిన ప్రఖ్యాత కాల్పిత కథల రచయిత్రి. 1997లో "హారీ పోట్టర్ అండ్ ది ఫిలాసఫర్స్ స్టోన్" పేరుతో తొలి ఫాంటసీ నవల విడుదల కావడం, ప్రభంజనం సృష్టించడం, దాని తర్వాత వరుసగా మరో ఆరు సీరియల్ నవలలు విడుదల కావడం, 2007లో చివరి హారీ పోట్టర్ నవల "హారీ పోట్టర్ అండ్ ది డెడ్లీ హాల్లోస్" విడుదల కావడం, ఈ మొత్తం ఏడు నవలలు అత్యధికంగా అమ్ముడుపోవడం ఓ అద్భుతమైన సాహిత్య ఘనకార్యం. హారీ పోట్టర్ శ్రేణి ఊహాత్మక కథల పుస్తకాలతో పాటు డ్రామా, యువతకు సంబంధించిన కట్టుకథలు, నేర కల్పిత కథలు లాంటి రచనలు కూడా చేసిన రౌలింగ్ నేటికీ తన రచనలతో సాహిత్య అభిమానుల మనసులు గెలుచుకుంటున్నది.

చెడుపై మంచి, చీకటిపై వెలుగుల విజయానికి, న్యాయ పోరాటానికి సూచికగా నిలుస్తున్న హారీ పోట్టర్ కల్పిత కథతో కూడిన నవలలు నేటికీ పౌర సమాజం ప్రేమ, స్నేహం, విధేయతలకు చిరునామాగా నిలుస్తూ విద్య విజ్ఞాన సంపన్న హీరోలైన వారందరూ అన్ని అడ్డంకులను ఛేధించుకుంటూ విజయతీరాలకు చేరతారనే నమ్మకాన్ని అనుభూతి పొందడం ఆశ్చర్యకరం, అభినందనీయం.



-మధుపాళీ
9949700037

# పంటల మూల్యాంకనాన్ని, ఎగుమతి ప్రణాళికని మెరుగుపరచడానికి
# ఏఐ ఆధారిత బాస్మతి ధాన్య సర్వే ప్రాజెక్టు ప్రారంభం

న్యూఢిల్లీ, మే1:భారత్‌లో బాస్మతి బియ్యం అనుబంధ విస్తారిత వ్యవస్థను బలోపేతం చేసే దిశగా మరో ముఖ్య చర్య తీసుకున్నారు. అగ్రికల్చరల్, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రాడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ), వ్యవసాయ విభాగం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం.. వీటి మధ్య 70 సంవత్సరాల కౌలు ఒప్పందంపై సంతకాల ప్రక్రియ పూర్తి అయింది. దీంతో పిలిభిత లోని టాండా బిజైసీలో బాస్మతి, సేంద్రియ శిక్షణ కేంద్రంతో పాటు ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి భూమి బదలాయింపు ప్రక్రియకు సంబంధించిన లాంఛనాన్ని నెరవేర్చినట్లయింది.

బాస్మతి, సేంద్రియ శిక్షణ కేంద్రంతో పాటు ప్రదర్శన క్షేత్రాన్ని సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పుతారు. దీనిలో భాగంగా ఒక సభాభవనం, బాస్మతి, సేంద్రియ వ్యవసాయంపై ఒక వస్తు ప్రదర్శనశాల, చిత్రశాల, సమావేశాల నిర్వహణకో గది, ప్రయోగశాల, సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన సామగ్రిని నిల్వ చేసే సదుపాయం.. వీటిని అందుబాటులోకి తీసుకువస్తారు. బాస్మతి రైతులకు, సేంద్రియ వ్యవసాయ రైతులకు శిక్షణనివ్వడంతో పాటు సామర్థ్యాన్ని పెంచడంలో ఈ కేంద్రం తోడ్పడుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ నిపుణులకు, విద్యార్థులకు రిసోర్స్ సెంటర్‌గా కూడా ఇది తన సేవలను అందించనుంది.

ఈ కేంద్రం స్థాపన పూర్తి అయిన తరువాత ఇది దేశంలో తొలి బాస్మతి సేంద్రియ శిక్షణ, ప్రదర్శన క్షేత్రంగా నిలుస్తుంది. దీనిలో సాంప్రదాయిక, సేంద్రియ .. ఈ రెండు రకాలైన బాస్మతి సాగును చేపడతారు. దీనిని నెలకొల్పుతున్న స్థానాన్ని బట్టి చూస్తే, ఈ కేంద్రం ద్వారా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రైతులకీ, ఆసక్తిదారుల (స్టేక్‌హోల్డర్స్)కీ ప్రయోజనాలు అందే అవకాశం ఉంది.

ఈ సందర్భంగా సభను ఉద్దేశించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద ప్రసంగిస్తూ, ఈ సంతకాల కార్యక్రమాన్ని ప్రశంసించారు. బాస్మతి బియ్యం ఉత్పాదనలో ప్రముఖ క్షేత్రంగా పిలిభీత్ అభివృద్ధి చెందేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. సేంద్రియ వ్యవసాయాన్ని విస్తరించడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సి ఉందని ఆయన వివరిస్తూ, దీనిలో రైతులు భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సందర్శకులకు, విద్యార్థులకు సమాచారంతో పాటు అనుభవపూర్వక శిక్షణను అందజేయడానికి ఈ కేంద్రంలో ఏఐ ఆధారిత ఇంటరాక్టివ్ మ్యూజియమ్ ఏర్పాటు చేయడమే కాక రైతులకు నాణ్యమైన బాస్మతి విత్తనాలు, సేంద్రియ సామగ్రిని అందుబాటులోకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఒక ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆయన సలహా ఇచ్చారు.

ఈ సందర్భంగా, భారత ఒకటో ఏఐ ఆధారిత బాస్మతి ధాన్య సర్వే ప్రాజెక్టు (2026-2028)ను కూడా శ్రీ జితిన్ ప్రసాద ఆవిష్కరించారు. దీనిని ఏపీఈడీఏ అఖిల భారతీయ బియ్యం ఎగుమతి దారు సంస్థల సంఘం (ఏఐఆర్ఈఏ) సహకారంతో అమలు చేస్తారు. దాదాపు 40 లక్షల హెక్టార్ల క్షేత్రానికి ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు అందుతాయి. 1,50,000 కన్న ఎక్కువ క్షేత్ర స్థాయి సర్వే పాయింట్లతో ఇది డేటాను సమీకరిస్తుంది. అంతేకాక 5,00,000 మందికి పైగా రైతులతో కలిసి పనిచేస్తుంది. ఖచ్చితమైన పంట మూల్యాంకనం, రకాలను గుర్తించడం, శాస్త్రీయ సలహా సేవలను అందించడంతో పాటు మెరుగైన ఎగుమతి ప్రణాళిక రచనలోనూ సహకరిస్తుంది.

త్వరలో ఏర్పాటు చేసే ఈ కేంద్రాన్ని 61వ వార్షిక ధాన్య పరిశోధన గ్రూపు సమావేశంలో గుర్తించిన ప్రకారం బాస్మతి బియ్యం పరీక్షలకు గాను అఖిల భారతీయ సమన్వయ పూరిత పరిశోధన ప్రాజెక్టుల (ఏఐసీఆర్‌పీ) కేంద్రంగా కూడా నామినేట్ చేశారు. అలాగే, నగీనా (బిజ్‌నోర్), బీఈడీఎఫ్ మోదీపురమ్ ల తరువాత ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాస్మతి జీఐ జోన్‌లో మూడో ఏఐసీఆర్‌పీ కేంద్రంగా పిలిభీత్ మారనుంది. దీంతో ఈ ప్రాంతంలో వ్యవసాయ, వాతావరణ పరిస్థితులకు సరిపోయే కొత్త బాస్మతి రకాలను పద్ధతి ప్రకారం పరీక్షించడంతో పాటు వాటి మూల్యాంకనానికి కూడా మార్గం సుగమం కానుంది.

భారత్‌లో జియాగ్రఫికల్ ఇండికేషన్ (జీఐ) పొందిన ఉత్పాదనలలో బాస్మతి బియ్యం కూడా ఒకటి. 2025-26లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతి చేశారు. ఈ బియ్యం విలువ 5.67 బిలియన్ అమెరికా డాలర్లు. మధ్యప్రాచ్యం, యూరప్, ఉత్తర అమెరికా మార్కెట్లలో బాస్మతి బియ్యం లభ్యం అవుతోంది. భారత వ్యావసాయిక ఎగుమతుల్లో బాస్మతి ఎగుమతుల వాటా గణనీయంగా ఉంది.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించడంలో శిక్షణ, ధ్రువపత్రం పొందే ప్రక్రియలో సహకరించడం, మార్కెట్ సంబంధాల విషయంలో తోడ్పడడం ద్వారా సేంద్రియ సాగును ఏపీఈడీఏ ప్రోత్సహిస్తోంది. పర్యావరణం పట్ల బాధ్యతతో కూడిన ఉత్పాదనలకు ప్రపంచంలో రోజు రోజుకూ పెరుగుతున్న డిమాండుకు అనుగుణంగా ఈ ప్రయత్నాలు ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాదతో పాటు జిల్లాకు చెందిన సీనియర్ ప్రజాప్రతినిధులు, ఏపీఈడీఏ అధికారులు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో పాటు ఇతర ఆసక్తిదారులు పాల్గొన్నారు.

# ఉద్యోగం రాదేమోనన్న ఆందోళనతో అమెరికాలో తెలుగు యువకుడి ఆత్మహత్య

న్యూ ఢిల్లీ, మే1: ఉద్యోగం రాదేమోనన్న ఆందోళనతో అమెరికా లో కర్నూలు యువకుడు చందు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ వార్త తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపుతోంది. 26 ఏళ్ల వయసులో ఎన్నో ఆశలతో ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్ళిన యువకుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అందరి హృదయాలను కలచివేస్తోంది. కాగా కర్నూలుకు చెందిన ఇరగనబోయిన చందు షికాగో లోని డీపాల్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ 2.0 ప్రభుత్వంలో నెలకొన్న పరిస్థితులు, హెచ్-1బి వీసా నిబంధనల మార్పుల వల్ల కొత్తగా చదువు పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు రావడం సవాలుగా మారింది.

చందు కూడా గత కొంతకాలంగా ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన ఖర్చుల కోసం మళ్ళీ తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తోందన్న భావన అతనిని మరింత కుంగదీసింది.

# రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



ఆదిలాబాద్, మే1:ఇందిరమ్మరాజ్యంతోనే ఇంటింటా సౌభాగ్యంసాధ్యమని రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిఅన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని మొగ్దుంపూర్ లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లమంజూరుచేస్తామని అన్నారు. పేదల సొంతింటి కల ప్రభుత్వం నెరవేరుస్తుందని అర్హులైన పేదలకు మరిన్ని ఇండ్లు మంజూరుచేస్తామనిఅన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేస్తుండడంతో లబ్ధిదారుల కళ్ళల్లో సంతోషంచూస్తున్నామని అన్నారు. లబ్ధిదారులు సకాలంలో ఇండ్ల నిర్మాణ పనులు పూర్తిచేస్తే మరిన్నిఇల్లుమంజూరుచేస్తామని అన్నారు. మొగ్దుంపూర్ సర్పంచ్ తిరుమలేష్ తమ గ్రామానికి మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా జాబితా పరిశీలించి ఇండ్లు మంజూరు చేస్తాననిహామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిషోర్ కుమార్, సర్పంచ్ తిరుమలేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు యగ్నేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సూర్యప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎల్కోటి జనార్దన్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోరం మహేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులుపాల్గొన్నారు.

# స్వయంసహాయక సంఘాల పొదుపు ఖాతాను ప్రారంభించిన
# ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)

న్యూఢిల్లీ, మే1:స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) పొదుపు ఖాతాలను ప్రారంభిస్తున్నట్టు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) ఈ రోజు ప్రకటించింది. కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని తపాలా శాఖకు చెందిన ఈ సంస్థ 100 శాతం భారత ప్రభుత్వ యాజమాన్యంలో ఉంది. గ్రామీణ భారతదేశంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూతనివ్వడం, ఆర్థిక వ్యవస్థలో వారిని భాగస్వాములను చేయడం లక్ష్యంగా ఈ ప్రత్యేక ఖాతాను అందుబాటులోకి తెచ్చారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ "బ్యాంకింగ్ సేవలను ప్రతి భారతీయుడికీ సరళంగా, సులభంగా, సమ్మిళితంగా అందుబాటులోకి తేవడమే ఐపీపీబీ ప్రధాన లక్ష్యం. నమ్మకమైన, తక్కువ వ్యయంతో కూడిన బ్యాంకింగ్ సదుపాయాల ద్వారా మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక సంఘాలను సశక్తులను చేసే దిశగా ఈ ఎస్‌హెచ్‌జీ పొదుపు ఖాతా ఒక కీలక ముందడుగు. ఇంటి వద్దకే బ్యాంకింగ్ సేవల విధానం, డిజిటల్ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడం ద్వారా ఈ సంఘాలు అధికారిక ఆర్థిక వ్యవస్థలో క్రియాశీల భాగస్వాములయ్యేలా చూడడం, తద్వారా సుస్థిర ఆర్థిక వృద్ధిని సాధించడం మా లక్ష్యం" అని ఐపీపీబీ ఎండీ, సీఈఓ శ్రీ ఆర్. విశ్వేశ్వరన్ అన్నారు.

దేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరివర్తనలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం, నాబార్డ్ మద్దతుతో నడిచే కార్యక్రమాలతో స్వయం సహాయక సంఘాలకు సన్నిహిత సంబంధాలున్నాయి.

తపాలా శాఖకు ఉన్న తిరుగు లేని నెట్‌వర్కును, స్వీయ డిజిటల్ సామర్థ్యాలను ఉపయోగించుకుంటూ విస్తృతమైన పోస్ట్‌మెన్, గ్రామీణ డాక్ సేవక్ వ్యవస్థ సహకారంతో స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సేవల లభ్యతను మరింత చేరువ చేయాలని ఐపీపీబీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా డిజిటల్ ఆన్ బోర్డింగ్, ఇంటి వద్దకే బ్యాంకింగ్ సేవలను ఐపీపీబీ అందిస్తోంది.

ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాల కోసం ఐపీపీబీ రూపొందించిన ఈ ఎస్‌హెచ్‌జీ పొదుపు ఖాతా... సమ్మిళిత వృద్ధి, సుస్థిర జీవనోపాధి అన్న జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా సరళమైన, అందుబాటులో ఉండే, ఉచిత బ్యాంకింగ్ సదుపాయాన్ని వారికి అందిస్తుంది.

కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని తపాలా శాఖ ఆధ్వర్యంలో 100 శాతం భారత ప్రభుత్వ యాజమాన్యంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకును నెలకొల్పారు. 2018 ఈ బ్యాంకును సెప్టెంబరు 1న ఈ బ్యాంకు ప్రారంభమైంది. సామాన్య భారతీయుడికి అత్యంత చేరువగా ఉండేలా, తక్కువ ఖర్చుతో కూడిన నమ్మకమైన బ్యాంకుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. దాదాపు 1,65,000 పోస్టాఫీసులు (వీటిలో 1,40,000 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి), మూడు లక్షల మంది తపాలా సిబ్బందితో కూడిన విస్తృత వ్యవస్థను ఉపయోగించుకుంటూ బ్యాంకింగ్ సేవలు లేని వారు, పూర్తిస్థాయిలో బ్యాంకింగ్ సేవలను పొందలేని వారితో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవడం ఐపీపీబీ ప్రధాన కర్తవ్యం.ఇండియా స్టాక్ అనే కీలక ప్రాతిపదికలు ఐపీపీబీ విస్తృతి, కార్యాచరణకు మూలం. స్మార్ట్ ఫోన్, బయోమెట్రిక్ పరికరాలను సీబీఎస్‌తో అనుసంధానించడం ద్వారా భౌతికంగా పత్రాలు అవసరం లేకుండా, నగదుతో పనిలేని, బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సులభంగా, సురక్షితంగా వినియోగదారుల ఇంటి వద్దకే బ్యాంకు సేవలను ఐపీపీబీ చేరుస్తోంది.

# లడఖ్‌లో పాడి రంగ మౌలిక సదుపాయాలకు ఊతం... పాల ప్రాసెసింగ్ యూనిట్లను, మిల్క్ కూలింగ్ సిస్టమ్స్‌ను, సంచార పరీక్షా సదుపాయాలను ప్రారంభించనున్న శ్రీ అమిత్ షా

న్యూ ఢిల్లీ, మే1:సహకార రంగం దన్నుతో గ్రామీణాభివృద్ధిని పటిష్ఠపరిచేందుకు, కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌లో పాడి రంగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ముఖ్య నిర్ణయంలో భాగంగా అనేక కార్యక్రమాలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించనున్నారు. 2026 మే నెల 1న లేహ్‌లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బుద్ధిస్ట్ స్టడీస్ (సీఐబీఎస్)లో ఏర్పాటు చేసే సభలో ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారు. కేంద్ర మత్స్య పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్‌తో పాటు లడఖ్ లెఫ్టినెంట్ గవర్నరు శ్రీ వినయ్ కుమార్ సక్సేనా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

పాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం, కోల్డ్-చైన్ వ్యవస్థలను మెరుగుపరచడం, స్థానిక పాడి రైతులను దృష్టిలో పెట్టుకొని మార్కెట్ సంబంధాల్ని విస్తరించే ఉద్దేశంతో వేర్వేరు డెయిరీ మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు ఈ కార్యక్రమంలో ప్రారంభోత్సవం, మరికొన్నింటికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాంతంలో కోఆపరేటివ్ డెయిరీ నిర్వహణ కార్యకలాపాల్ని ఆధునికీకరించడానికి డిజిటల్, సంస్థాగత కార్యక్రమాలను ఆరంభిస్తారు.

ఇదే కార్యక్రమంలో మంత్రి ... 10 టీఎల్‌పీడీ సామర్థ్యం కలిగివుండే డెయిరీ ప్లాంటుకు కార్గిల్‌లో శంకుస్థాపన చేస్తారు. దీంతో పాటు లేహ్‌లో పెరుగు, పన్నీరు ఉత్పాదనలు సహా కొత్త డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభిస్తారు. దీనికి అదనంగా పాల నిల్వ, రవాణా మౌలిక సదుపాయాలను దృఢతరంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన ఒక బల్క్ మిల్క్ కూలర్ వ్యవస్థను కూడా ప్రారంభిస్తారు.

సహకార రంగంలో డిజిటల్ సాధికారత దృష్టికోణాన్ని పటిష్ఠపరిచే దిశగా, కొనుగోలు ప్రక్రియల్ని సువ్యవస్థీకరించేందుకు, రైతులకు చెల్లింపుల్లో పారదర్శకతను నిర్ధారించేందుకు ఆండ్రాయిడ్ ఆధారిత ఆటోమేటెడ్ మిల్క్ కలెక్షన్ సిస్టమ్ (ఏఎమ్‌సీఎస్) అప్లికేషన్‌ను ప్రారంభించనున్నారు.

కార్యక్రమంలో భాగంగా ఒక మొబైల్ మిల్క్ టెస్టింగ్ లేబొరేటరీని కూడా ప్రారంభిస్తారు. ఇది నాణ్యతను నిర్ధారిస్తుంది. క్షేత్ర స్థాయిలో పాడి రైతులకు సహకారాన్ని అందిస్తుంది. కీలక ఆసక్తిదారుల నడుమ పాడి ఉత్పాదనల మార్కెటింగ్‌కు ప్రోత్సాహాన్నిచ్చేందుకు ఒక అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ)పై సంతకాలు చేయనున్నారు. దీంతో స్థానిక ఉత్పాదనలకు మెరుగైన మార్కెట్లు అందుబాటులోకి వస్తుంది. స్థానిక ఉత్పత్తిదారులకు మంచి ధర లభించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

రైతుల సంక్షేమంపై, సహకార రంగ సాధికారతపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు అనుగుణంగానే ఈ ప్రాంతంలోని ప్రగతిశీల పాడి రైతులను సత్కరించనున్నారు. సహకార సంస్థలకు సాధికారతను కల్పించే, దేశంలో సుదూర ప్రాంతాల్లో ఆర్థిక పురోగతి ఫలాలను అన్ని వర్గాలకూ అందించడాన్ని ప్రోత్సహించే దిశగా "సహకార్ సే సమృద్ధి" దార్శనికతను సాకారం చేయాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది.

# కీలక ఖనిజాల భద్రతలో భారత్ ముందడుగు.. రీసైక్లింగ్ పథకానికి అర్హత పొందిన 58 కంపెనీలు

న్యూఢిల్లీ, మే1:భారత కీలక ఖనిజాల భద్రతను బలోపేతం చేయడం, పునరుపయోగ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం దిశగా కీలక ముందడుగు పడింది. కీలక ఖనిజాల రీసైక్లింగ్ ప్రోత్సాహక పథకం కింద గనుల మంత్రిత్వ శాఖ అర్హత మదింపును పూర్తి చేసింది. ఈ పథకంలో పాల్గొనడానికి 58 కంపెనీలు అర్హత పొందాయి.

జాతీయ కీలక ఖనిజాల మిషన్ కింద మొత్తం రూ. 1,500 కోట్ల వ్యయంతో కూడిన ఈ పథకాన్ని వివరణాత్మక కార్యాచరణ మార్గదర్శకాల జారీతో 2025 అక్టోబర్ 2న ప్రకటించారు. లిథియం-అయాన్ బ్యాటరీలు, ఇ-వ్యర్థాలు, పారిశ్రామిక స్క్రాప్ నుంచి కీలక ఖనిజాల దేశీయ రీసైక్లింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. దీని ద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గడం సహా... పరిశుద్ధ ఇంధన రంగానికి, అధునాతన తయారీ రంగాలకు మద్దతు లభిస్తుంది.

2 అక్టోబర్ 2025 నుంచి 1 ఏప్రిల్ 2026 వరకు చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు పరిశ్రమ భాగస్వాముల నుంచి మంచి స్పందన లభించింది. అందిన ప్రతిపాదనల పరిశీలనను ఈ పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ, జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్‌లు పూర్తి చేశాయి.




# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



అమరావతి, మే1: నిరంతరం ప్రజల మంచి కోసం ఆలోచించే సీఎం చంద్రబాబు వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ పట్టణం 36వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం ఉదయం పాల్గొన్నారు. నూతనంగా మంజూరైన పెన్షన్లతో పాటుగా పలువురు లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే రాము ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నగదును పంపిణీ చేశారు.

నూతన పెన్షన్ నగదు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే రాము మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంచివాడు మా రాము అంటూ.. ఎమ్మెల్యేతో పలువురు వృద్ధులు తమ సెల్ ఫోనుల ద్వారా ఫోటోలు దిగారు.

అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడారు...సీఎం చంద్రబాబు ప్రణాళిక ప్రకారం కొత్త పెన్షన్ల మంజూరును నిరంతర ప్రక్రియగా చేయడమే కాకుండా, వితంతు పెన్షన్ల ప్రక్రియను సులభతరం చేశారన్నారు.గొప్ప ఆలోచనలతో సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచిస్తూ... అనేక మంచి పనులు చేస్తుందన్నారు.

కార్యాలయాల్లో కూర్చొని చట్టాలు చేయడం కాదు... ప్రజల మధ్య ఉంటూ...ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మనం వారిని ఆదుకోవాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా గుడివాడ నియోజకవర్గంలో పర్యటిస్తున్నానని పేర్కొన్నారు. గుడివాడ అభివృద్ధికి ప్రజలు ఇస్తున్న మద్దతు చూస్తుంటే నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సింహాద్రి గారు,రావి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు మరో రూ.8 వేల కోట్లు!

అమరావతి, మే1:కేంద్ర ప్రభుత్వం గతేడాది ప్రకటించిన భారీ ఆర్థిక ప్యాకేజీతో కొంత స్థిరత్వం సాధించిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు మరోసారి ఊరట లభించనుంది. ప్లాంట్ కార్యకలాపాలను మరింత సుస్థిరంగా కొనసాగించేందుకు కేంద్రం మరో రూ.8,097 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఈ ప్రతిపాదనకు సంబంధించిన ఫైల్‌ను కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆమోదించి, తదుపరి చర్యల కోసం ఆర్థిక శాఖకు పంపినట్లు తెలుస్తోంది. ఆర్థిక శాఖ వ్యయ విభాగం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే ఈ ప్రతిపాదన కేంద్ర మంత్రివర్గం ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమై కార్యకలాపాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఉక్కు ఉత్పత్తి, అమ్మకాలు కూడా పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ సానుకూల పరిస్థితి దీర్ఘకాలం కొనసాగేందుకు అవసరమైన మద్దతు అందించడమే లక్ష్యంగా రెండో దశ ప్యాకేజీ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

గతంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రంతో జరిపిన సంప్రదింపుల ఫలితంగా తొలి దశలో రూ.11,440 కోట్ల ప్యాకేజీ మంజూరైంది. అందులో రూ.10,300 కోట్లు ఈక్విటీ రూపంలో, మరో రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ రుణాల రూపంలో అందించారు.

ఇప్పుడు ప్రతిపాదిత రూ.8,097 కోట్ల నిధులను కూడా ఈక్విటీ రూపంలోనే సమకూర్చాలని కేంద్ర ఉక్కుశాఖ నిర్ణయించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై ఆశలు మరింత బలపడుతున్నాయి.

# టెన్త్ ఫెయిల్ అయిన బాధతో బాలిక ఆత్మహత్య..

## -మూడు మార్కుల తేడాతో విషాదాంతం

కర్నూలు, మే1:జిల్లాలో పదో తరగతి ఫలితాలు ఓ కుటుంబంలో విషాదాన్ని మిగిల్చాయి. పత్తికొండ మండలం కనకదిన్నె గ్రామానికి చెందిన అవంతి అనే విద్యార్థిని టెన్త్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం ప్రకారం, ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో అవంతికి సైన్స్ విషయంలో మూడు మార్కులు తక్కువగా రావడంతో ఫెయిల్ అయినట్లు తెలిసింది.

ఫలితాలు తెలిసిన తరువాత తీవ్ర నిరాశకు లోనైన ఆమె ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. బాలిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరీక్షల్లో అపజయం సాధారణమేనని, ఒక్కసారి విఫలమైనంత మాత్రాన జీవితమే ముగిసిపోయిందని భావించవద్దని ఉపాధ్యాయులు, పెద్దలు సూచిస్తున్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, మళ్లీ ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని సూచించారు.

# బెల్లంపల్లిలో ఘనంగా మే డే వేడుకలు



నల్గొండ, మే1:సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని పలు రైల్వే విభాగాల్లో శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘం చైర్మన్ ఎస్. నాగరాజు, సెక్రటరీ జి. సాంబశివుడు లాల్ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, దేశంలో రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అనేక పోరాటాలు నిర్వహించి కార్మికుల హక్కులను కారైల్వే కార్మికుల సమస్యలను సంబంధిత శాఖ వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ కమిటీ సభ్యులు, రైల్వే కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెప్పుతో కొట్టిన కండక్టర్

అమరావతి, మే1: ఆర్టీసీ టికెట్ ఇన్‌స్పెక్టర్‌పై కండక్టర్, ప్రయాణికులు కలిసి దాడి చేసిన ఘటన నారాయణఖేడ్ డిపో పరిధిలో సంచలనం రేపింది. టికెట్ తనిఖీ సమయంలో వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో చెప్పులతో కొట్టి దాడి చేశారు.

తెలంగాణ రాష్ట్రంలోని నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును రాయికోడ్ వద్ద టికెట్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని ఆయన గుర్తించారు. ప్రయాణికుడితో పాటు కండక్టర్‌పై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.20 వేల లంచం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# నిన్న 50.8 లక్షలకు పైగా దేశీయ ఎల్‌పీజీ సిలిండర్లు, 73,000కు పైగా 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల పంపిణీ

న్యూఢిల్లీ, మే1: పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు క్రమం తప్పకుండా సమాచారాన్ని అందించే చర్యలను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో జాతీయ మీడియా కేంద్రంలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో పెట్రోలియం- సహజ వాయువు, ఓడరేవులు- విమానయానం- జలమార్గాలు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల అధికారులు.. ఇంధన లభ్యత, సముద్ర కార్యకలాపాలు, ఆ ప్రాంతంలోని భారతీయులకు అందుతున్న సహాయం, కీలక రంగాలలో స్థిరత్వాన్ని కాపాడడానికి తీసుకుంటున్న చర్యలపై తాజా సమాచారాన్ని అందించారు.

ఇంధన సరఫరా, లభ్యత

పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్‌పీజీ నిరంతరాయంగా లభ్యమయ్యేలా చూసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించిన పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ.. ఇంధన సరఫరా విషయంలో ప్రస్తుత పరిస్థితిపై తాజా సమాచారాన్ని అందించింది. మంత్రిత్వ శాఖ తెలియజేసిన వివరాలు:

సహజ వాయువు సరఫరా, పీఎన్‌జీ విస్తరణ కార్యక్రమాలు

డీ-పీఎన్‌జీ, సీఎన్‌జీ- రవాణాకు 100 శాతం సరఫరాలతో వినియోగదారులకు ప్రాధాన్యమిస్తున్నారు.

ఎరువుల కర్మాగారాలకు కేటాయించే మొత్తం గ్యాస్‌ను, వాటి ఆరు నెలల నగటు వినియోగంలో సుమారు 95 శాతానికి పెంచారు.

అదనంగా, సీజీడీ నెట్‌వర్క్‌ల ద్వారా జరిగే సరఫరాలు సహా... ఇతర పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు గ్యాస్ సరఫరాను 80 శాతం వరకు పెంచారు.

వాణిజ్య ఎల్‌పీజీ లభ్యతకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించడానికి సీజీడీ సంస్థలు తమ అన్ని జీఏల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాంటీన్ల వంటి వాణిజ్య సంస్థలకు పీఎన్‌జీ కనెక్షన్లకు ప్రాధాన్యమివ్వాలని సూచించాయి.

ఐజీఎల్, ఎంజీఎల్, జీఏఐఎల్ గ్యాస్, బీపీసీఎల్ వంటి సీజీడీ కంపెనీలు గృహ, వాణిజ్య పీఎన్‌జీ కనెక్షన్‌ల కోసం ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి.

సీజీడీ నెట్‌వర్క్‌ల విస్తరణకు అవసరమైన ఆమోదాలను వేగవంతం చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలను కోరారు.

ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీకి దీర్ఘకాలిక పరివర్తనలో సహాయపడే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్‌పీజీలో అదనంగా 10 శాతం కేటాయింపును తేది 18.03.2026 నాటి లేఖ ద్వారా భారత ప్రభుత్వం ప్రతిపాదించింది.

పీఎన్‌జీ విస్తరణ సంస్కరణలకు అనుసంధానంగా 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అదనపు వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపును పొందుతున్నాయి.

రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తేదీ 24.03.26 నాటి లేఖ ద్వారా సీజీడీ మౌలిక సదుపాయాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యత ప్రాతిపదికన ప్రాసెస్ చేయడానికి, 'తగ్గించిన కాలపరిమితులతో సీజీడీ మౌలిక సదుపాయాల కోసం వేగవంతమైన ఆమోద విధాన ప్రణాళిక'ను 3 నెలల పాటు ప్రత్యేకంగా అమలు చేస్తోంది.

24.03.2026 తేదీ గల గెజిట్ ద్వారా భారత ప్రభుత్వం... నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద సహజ వాయువు, పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీ (పైప్‌లైన్‌లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయడం, నిర్మించడం, నిర్వహించడం, విస్తరించడం ద్వారా) ఉత్తర్వులు-2026ను జారీ చేసింది. ఈ ఉత్తర్వు దేశవ్యాప్తంగా పైప్‌లైన్‌లను వేయడానికి, విస్తరించడానికి ఒక క్రమబద్ధమైన, కాలపరిమితితో కూడిన విధాన ప్రణాళికను అందిస్తుంది. ఇది అనుమతులు, భూమి లభ్యతలో జాప్యాలను పరిష్కరించి, నివాస ప్రాంతాలు సహా సహజ వాయువు మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధికి వీలు కల్పిస్తుంది. ఇది పీఎన్‌జీ నెట్‌వర్క్ వృద్ధిని వేగవంతం చేస్తుందని, మారుమూల ప్రాంతాలతో కనెక్టివిటీని మెరుగుపరుస్తుందని, స్వచ్ఛమైన ఇంధనాలకు మారడానికి మద్దతునిస్తుందని, తద్వారా ఇంధన భద్రతను బలోపేతం చేసి భారత గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తుందని భావిస్తున్నారు.

డీ-పీఎన్‌జీ కనెక్షన్‌లను వేగవంతం చేయాలని సీజీడీ సంస్థలను పీఎన్‌జీఆర్‌బీ ఆదేశించింది. పీఎన్‌జీ విస్తరణలో వేగాన్ని కొనసాగించడానికి నేషనల్ పీఎన్‌జీ డ్రైవ్ 2.0ను 30.06.2026 వరకు పొడిగించారు.

పరిశుద్ధమైన, మరింత సురక్షితమైన, స్వయం సమృద్ధిగల ఇంధన భవిష్యత్తును ప్రోత్సహించడం కోసం భారత ప్రభుత్వం రాష్ట్ర సీబీజీ విధానం కోసం నమూనా ముసాయిదాను అభివృద్ధి చేసింది. ఈ నమూనా విధానం, సీబీజీ అభివృద్ధి కోసం రాష్ట్రాలు తమ సొంత, పెట్టుబడిదారులకు అనుకూలమైన, అమలుకు అనువుగా ఉండే వ్యవస్థను సృష్టించుకోవడానికి వీలు కల్పించే ఒక సమగ్రమైన, సరళమైన మార్గదర్శక విధాన ప్రణాళికగా పనిచేయడానికి ఉద్దేశించినది. దీనిని ఎంచుకున్న రాష్ట్రాలకు, వాణిజ్య ఎల్‌పీజీ అదనపు కేటాయింపుల తదుపరి విడతలో ప్రాధాన్యమిస్తారు.

ఎమ్‌వోఈఎఫ్‌సీసీ 07.04.2026 తేదీ నాటి ఉత్తర్వుల ద్వారా... సీజీడీ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి, నిర్వహించడానికి 15 రోజుల్లోపు అనుమతి మంజూరు చేసేందుకు ఎస్‌పీసీబీ, పీసీసీలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని సీపీసీబీని ఆదేశించింది.

మార్చి 2026 నుంచి, సుమారు 5.69 లక్షల పీఎన్‌జీ కనెక్షన్‌లకు గ్యాసిఫికేషన్ పూర్తయింది. అదనంగా 2.65 లక్షల కనెక్షన్‌ల కోసం మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో మొత్తం కనెక్షన్‌ల సంఖ్య 8.34 లక్షలకు చేరింది. కొత్త కనెక్షన్‌ల కోసం సుమారు 6.37 లక్షల మంది వినియోగదారులు నమోదు చేసుకున్నారు.

28.04.2026 వరకు, 42,950 కంటే ఎక్కువ మంది పీఎన్‌జీ వినియోగదారులు ఓజఖఔఉఆ.తిని వెబ్‌సైట్ ద్వారా తమ ఎల్‌పీజీ కనెక్షన్‌లను వదులుకున్నారు.

ముడి చమురు స్థితి, రిఫైనరీ కార్యకలాపాలు

అన్ని రిఫైనరీలు తగినంత ముడి చమురు నిల్వలతో అధిక సామర్థ్యంతో పనిచేస్తుండగా... పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంతగా నిర్వహిస్తున్నారు.

గృహ వినియోగానికి మద్దతుగా రిఫైనరీల నుంచి దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచారు.

దేశీయ మార్కెట్‌కు పెట్రోకెమికల్ ఫీడ్‌స్టాక్ సరఫరా లభ్యతను నిర్ధారించడానికి అంతర్-మంత్రిత్వ శాఖల సంయుక్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ హై టెక్నాలజీ నిర్ధారించిన విధంగా కీలక రంగాలకు సీ3 ఉ సీ4 స్ట్రీమ్‌ల నిర్దిష్ట కనీస పరిమాణాలను అందుబాటులో ఉంచడానికి భారత ప్రభుత్వం 01.04.2026 తేదీ నాటి ఉత్తర్వు ద్వారా పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లతో సహా ఆయిల్ రిఫైనరీ కంపెనీలను అనుమతించింది.

ఫార్మాస్యూటికల్స్ విభాగం, రసాయనాలు-పెట్రో కెమికల్స్ విభాగం, పరిశ్రమలకు ప్రోత్సాహం-అంతర్గత వాణిజ్య విభాగం ద్వారా అందిన అభ్యర్థనల ఆధారంగా... ఫార్మా, రసాయన రంగ కంపెనీలకు ఎల్‌పీజీ పూల్ నుంచి రోజుకు 1000 మెట్రిక్ టన్నుల కేటాయింపు చేశారు.

9 ఏప్రిల్ 2026 నుంచి ముంబయి, కొచ్చి, వైజాగ్, చెన్నై, మధుర రిఫైనరీలు రసాయన, ఫార్మా, పెయింట్ పరిశ్రమలకు 8900 మెట్రిక్ టన్నులకు పైగా ప్రొపైలిన్, 950 మెట్రిక్ టన్నులకు పైగా బ్యూటైల్ అక్రిలేట్‌ను విక్రయించాయి.

రిటైల్ ఇంధన లభ్యత, ధరల సంబంధిత చర్యలు

దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు యథావిధిగా పనిచేస్తున్నాయి.

మధ్యప్రాచ్య సంక్షోభం ముడి చమురు ధరల్లో అసాధారణ పెరుగుదలకు దారితీసింది. వినియోగదారులను అధిక ధరల నుంచి ఆదుకోవడానికి భారత ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ. 10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది.

దేశీయ మార్కెట్లో ఈ ఉత్పత్తుల లభ్యతను నిర్ధారించడానికి, భారత ప్రభుత్వం 11.04.2026 తేదీ నాటి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా డీజిల్‌పై ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ. 55.50కు, ఏటీఎఫ్‌పై లీటరుకు రూ. 42కు పెంచింది.

వదంతుల కారణంగా కొన్ని రిటైల్ అవుట్‌లెట్లలో భయాందోళనతో కొనుగోళ్లు జరుగుతున్నాయి. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంత అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. పెట్రోల్, డీజిల్ సాధారణ రిటైల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. పీఎస్‌యూ ఓఎంసీల రిటైల్ అవుట్‌లెట్లలోనూ ధరల పెంపు లేదు.

కిరోసిన్ లభ్యత, పంపిణీ చర్యలు

సాధారణ కేటాయింపులకు అదనంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేటాయించారు.

18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎస్‌కేవో కేటాయింపు ఉత్తర్వులను జారీ చేయగా... హిమాచల్ ప్రదేశ్, లదాఖ్‌లు దీని అవసరం లేదని తెలియజేశాయి.

నౌకా వాణిజ్య భద్రత, నౌకాయాన కార్యకలాపాలు

పర్షియన్ గల్ఫ్‌లో నెలకొన్న నౌకా వాణిజ్య పరిస్థితిపై ఓడరేవులు, నౌకాయానం, జల రవాణా మంత్రిత్వ శాఖ తాజా సమాచారాన్ని అందించింది. ఈ ప్రాంతంలో భారతీయ నౌకలు, సిబ్బంది భద్రత, రక్షణను నిర్ధారించడానికి తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ ఈ నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో కింది విషయాలను పేర్కొన్నది:

సులభమైన నౌకా వాణిజ్య కార్యకలాపాలను నిర్ధారించడానికి, నౌకాయానం ద్వారా ఎగుమతి-దిగుమతులను సులభతరం చేయడం కోసం ఓడరేవులు, నౌకాయానం, జల రవాణా శాఖ... పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ... విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్... ఎరువుల శాఖ తీసుకున్న చర్యలను ఓడరేవులు, నౌకాయానం, జల రవాణా శాఖా మంత్రి సమీక్షించారు.

ఈ ప్రాంతంలోని భారతీయ నావికులంతా సురక్షితంగా ఉన్నారు. గత 24 గంటల్లో భారత జెండా ఉన్న నౌకలకు సంబంధించి ఎలాంటి ఘటన జరగలేదు.

డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ తాజా సమాచారం: ప్రారంభమైనప్పటి నుంచి ఈ కంట్రోల్ రూమ్ 8034 కాల్‌లు, 17,114 కంటే ఎక్కువ ఈమెయిళ్లను నిర్వహించింది. గత 24 గంటల్లో, 114 కాల్‌లు, 276 ఈమెయిళ్లు అందాయి.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్) ద్వారా, గల్ఫ్ ప్రాంతంలోని వివిధ ప్రదేశాల నుంచి గత 24 గంటల్లో స్వదేశానికి వచ్చిన 29 మందితో సహా, ఇప్పటివరకు 2,829 మందికి పైగా భారతీయ నావికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించడానికి మంత్రిత్వ శాఖ సౌకర్యం కల్పించింది.

దేశవ్యాప్తంగా పోర్ట్ కార్యకలాపాలు సాధారణంగా కొనసాగుతున్నాయి. ఎటువంటి రద్దీ నమోదు కాలేదు.

ఈ ప్రాంతంలో భారతీయ పౌరుల భద్రత

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గల్ఫ్, పశ్చిమాసియా ప్రాంతంలోని పరిణామాలను పర్యవేక్షిస్తూనే ఉంది. ఈ ప్రాంతంలోని భారతీయ పౌరుల భద్రత, రక్షణ, సంక్షేమాన్ని నిర్ధారించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. కింది విషయాలను తెలియజేసింది:

మంత్రిత్వ శాఖలోని ప్రత్యేక కంట్రోల్ రూమ్ భారత పౌరులు, వారి కుటుంబాల సందేహాలకు సమాధానమివ్వడానికి నిరంతరం పనిచేస్తోంది.

సమాచార మార్పిడి, కృషిని మరింత మెరుగ్గా సమన్వయం చేసుకోవడం కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లు నకాలంలో సహాయం అందించడానికి ఇరవై నాలుగు గంటలూ పనిచేసే హెల్ప్‌లైన్‌లను నిర్వహిస్తున్నాయి. మన పౌరులకు చురుగ్గా సహాయం అందిస్తున్నాయి. అవి స్థానిక ప్రభుత్వాలతోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నాయి.

స్థానిక ప్రభుత్వ మార్గదర్శకాలు, విమాన ప్రయాణ పరిస్థితులు, కాన్సులర్ సేవలు, భారత పౌరుల కోసం చేపడుతున్న వివిధ సంక్షేమ చర్యలకు సంబంధించిన సమాచారం సహా తాజా సూచనలను ఎప్పటికప్పుడు జారీ చేస్తున్నారు.

భారతీయ మిషన్లు స్థానిక భారతీయ పౌరులతో చురుగ్గా మమేకమై ఉన్నాయి. వారి సమస్యలను పరిష్కరించడం కోసం వారు భారతీయ పౌర సంఘాలు, సంస్థలు, వృత్తిపరమైన నిపుణుల బృందాలు, భారతీయ కంపెనీలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు.

ఈ ప్రాంతంలోని భారతీయ నావికుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. భారతీయ మిషన్లు స్థానిక అధికారులు, ఏజెన్సీలతో సమన్వయం చేయడం, కాన్సులర్ సహాయం అందించడం, స్వదేశానికి తిరిగి రావాలనే అభ్యర్థనలకు సహాయం చేయడం సహా వారికి అన్ని విధాలా సహాయం అందిస్తున్నాయి.

ఈ ప్రాంతం నుంచి భారత్‌లోని పలు గమ్యస్థానాలకు అదనపు విమానాలు నడుస్తుండటంతో, మొత్తం విమానయాన పరిస్థితి మెరుగుపడుతూనే ఉంది.

యూఏఈలోని విమానయాన సంస్థలు కార్యాచరణ, భద్రతా పరమైన అంశాల ఆధారంగా యూఏఈ-భారత్ మధ్య పరిమిత వాణిజ్య విమానాలను నడపడం కొనసాగిస్తున్నాయి. ఈ రోజు యూఏఈ-భారత్ మధ్య సుమారు 110 విమానాలు నడుస్తాయని అంచనా.

సౌదీ అరేబియా, ఒమన్‌లోని వివిధ విమానాశ్రయాల నుంచి భారత్‌లోని పలు గమ్యస్థానాలకు విమాన సర్వీసులు కొనసాగుతున్నాయి.

ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవడంతో, ఖతార్ ఎయిర్‌వేస్ భారత్‌లోని వివిధ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతోంది. ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలూ త్వరలో ఖతార్ నుంచి భారత్‌కు విమాన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నాయి.

కువైట్ గగనతలం తెరుచుకుంది. జజీరా ఎయిర్‌వేస్, కువైట్ ఎయిర్‌వేస్ సంస్థలు కువైట్ నుంచి భారత్‌కు పరిమిత విమాన కార్యకలాపాలను పునఃప్రారంభించాయి.

బహ్రెయిన్ గగనతలం తెరిచి ఉంది. గల్ఫ్ ఎయిర్ బహ్రెయిన్ నుంచి భారత్‌లోని పలు గమ్యస్థానాలకు విమానాలను నడుపుతోంది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో సంస్థలూ త్వరలో బహ్రెయిన్ నుంచి భారత్‌కు విమాన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని యోచిస్తున్నాయి.

ఈ ప్రాంతంలోని గమ్యస్థానాలకు పరిమిత విమాన కార్యకలాపాలతో ఇరాక్ గగనతలం తెరిచి ఉంది. దీనిని భారత్‌కు తిరిగి వచ్చే ప్రయాణం కోసం ఉపయోగించుకోవచ్చు.

ఇరాన్ గగనతలం సరుకు రవాణా, చార్టర్డ్ విమానాల కోసం పాక్షికంగా తెరిచి ఉంది. భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణించకుండా ఉండాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు భారత రాయబార కార్యాలయం మద్దతుతో భూ సరిహద్దు మార్గాల ద్వారా తిరిగి వెళ్లాలని కోరడమైనది. ఇప్పటివరకు, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం భూ సరిహద్దు మార్గాల ద్వారా 2,464 మంది భారత పౌరులు ఇరాన్ నుంచి బయటకు వెళ్ళడానికి సౌకర్యం కల్పించింది. ఇజ్రాయెల్ గగనతలం తెరిచి ఉంది. ఈ ప్రాంతంలోని గమ్యస్థానాలకు పరిమిత విమాన కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాయి. వీటిని భారత్‌కు తిరిగి రావడం కోసం ఉపయోగించుకోవచ్చు.

# వైభవంగా ఆది దంపతుల గిరిప్రదక్షిణ..



అమరావతి, మే1:వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ శుక్రవారం ఘనంగా జరిగింది. శ్రీ దుర్గా మల్లేశ్వరులు, శ్రీ విఘ్నేశ్వరుడు,శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వంటి సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రిగిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్ఠమని పండిత ఉవాచ. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవముగా ప్రారంభం అయింది. ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు.దేవస్థానం ముఖ్య అర్చకులు ఆర్. శ్రీనివాసశాస్త్రి తదితరులు పూజా కార్యక్రమం నిర్వహించారు.

సంప్రదాయ తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్ణయించిన మార్గంలో సాగింది. ఘాట్ రోడ్ శ్రీ అమ్మవారి గుడి,కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరిప్రదక్షిణ కొనసాగింది. శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లోస్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు,కొబ్బరికాయలు సమర్పించి, జయ జయధ్వానాలు చేశారు. గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదంను భక్తులకు దేవస్థానం నుండి అందజేయడమైనది. వేలాది మంది భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.

# పీఎం మోదీ ప్రభుత్వ అంకితభావానికి గుర్తు..ఆపరేషన్ సిందూర్: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, మే1:"ఉగ్రవాదులు దాడి చేస్తే దౌత్యపరమైన ప్రకటనలు జారీ చేసే పాత ఆలోచనా ధోరణితో భారతదేశం లేదనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి తెలియజేసింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆలోచనలు, మాటలకు మాత్రమే పరిమితం కాకుండా నిర్ణయాత్మక చర్యల ద్వారా తన అచంచలమైన నిబద్ధతను ప్రదర్శించింది'' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2026 ఏప్రిల్ 30న న్యూఢిల్లీలో జరిగిన జాతీయ భద్రతా సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉగ్రవాద చర్యలను సహించబోమనే ప్రభుత్వ సంకల్పాన్ని స్పష్టం చేశారు. బెదిరింపులకు అడ్డుకొనేందుకు ప్రభుత్వం కనబరిచిన దృఢ వైఖరిని సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ప్రదర్శిస్తాయన్నారు.

"వికృతమైన ఆలోచనలు, మనస్తత్వం నుంచి ఉగ్రవాదం పుడుతుంది. ఇది మానవత్వంపై మాయని మచ్చ. తీవ్రవాదంపై పోరాటం జాతీయ భద్రతకు సంబంధించినది మాత్రమే కాదు. ప్రాథమికంగా మానవత్వపు మూల విలువలను కాపాడే యుద్ధం. మానవ విలువలకు పూర్తి విరుద్ధంగా నిలిచే అనాగరిక భావజాలానికి వ్యతిరేకంగా చేసే పోరాటం. ఈ భారతీయ దృక్పథాన్ని దేశవిదేశాల్లోనూ స్పష్టం చేశాం" అని శ్రీ రాజనాథ్ సింగ్ అన్నారు.

ఉగ్రవాదం మనుగడలో ఉన్నంత కాలం.. అది సామాజిక శాంతికి, అభివృద్ధికి, సంక్షేమానికి సవాలు విసురుతూనే ఉంటుందని రక్షణ మంత్రి అన్నారు. ''ఉగ్రవాదానికి మతం రంగు పులమడం లేదా నక్సలిజం లాంటి హింసాత్మక భావజాలంతో ముడిపెట్టడం ద్వారా సమర్థించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరం. ఓ రకంగా, ఉగ్రవాదులు తమ లక్ష్యం దిశగా నెమ్మదిగా ముందుకు సాగడానికి ఇది రక్షణ కవచంలా పనిచేస్తుంది. దేశ వ్యతిరేకమైన ఉగ్రవాదానికి కార్యాచరణ, సైద్ధాంతిక, రాజకీయం వంటి బహుముఖ కోణాలున్నాయి. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటే.. ఈ మార్గాల్లోనూ మనం దాన్ని ఎదుర్కోవాలి" అని అన్నారు.

ఉగ్రవాదానికి పాకిస్థాన్ నిరంతరాయంగా అందిస్తున్న మద్దతు గురించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. "భారత్, పాకిస్థాన్ రెండింటికీ ఒకే సమయంలో స్వాతంత్ర్యం వచ్చింది. ఐటీ అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విషయంలో అంతర్జాతీయ గుర్తింపును భారత్ సొంతం చేసుకుంది. పాకిస్థాన్‌ను మాత్రం ఐటీ అంటే ఇంటర్నేషనల్ టెర్రరిజంకు కేంద్రంగా పరిగణిస్తున్నారు.

భారత రక్షణ బలగాల సమైక్యతకు, సమన్వయానికి గొప్ప ఉదాహరణగా ఆపరేషన్ సిందూర్‌ను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వర్ణించారు. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం ఒకే ప్రణాళికతో ఐక్యంగా పనిచేయడం ద్వారా.. భారతదేశ సైనిక శక్తి ఇకపై విడివిడిగా పని చేయబోదనీ, దానికి బదులుగా ఉమ్మడి, సమీకృత, ప్రపంచ శక్తిగా ఆవిర్భవించిందని తెలియజేశారు.

తన సొంత విధానం ప్రకారం మే నచ్చిన సమయంలో ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టిందని, ఆ విధానానికి అనుగుణంగానే దానిని నిలిపివేసిందని రక్షణ మంత్రి తెలియజేశారు. "మనపై దాడి చేసిన వారిని మాత్రమే ఈ ఆపరేషన్ సమయంలో అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకున్నాం. మన సామర్థ్యం తగ్గిపోవడం వల్ల లేదా క్షీణించడం వల్ల ఈ ఆపరేషన్‌ను నిలిపివేయలేదు. పూర్తిగా మన స్వీయ నిర్ణయాధికారంతోనే నిలిపివేశాం. ఈ యుద్ధాన్ని కొనసాగించేందుకు మనం సర్వసన్నద్ధులమై ఉన్నాం. ఆకస్మిక సంక్షోభ సమయాల్లో మన సామర్థ్యాలను వేగంగా పెంచుకోవడానికి అవసరమైన సామర్థ్యం, సహజసిద్ధమైన బలం మన దగ్గర ఉన్నాయి'' అని వెల్లడించారు.

భారత సైనిక-పారిశ్రామిక రంగం సాధారణ సమయాల్లోనే కాకుండా.. యుద్ధ సమయాల్లోనూ వేగవంతమైన సరఫరా, రవాణా అవసరాలను కూడా తీర్చేందుకు సైతం సర్వసన్నద్ధంగా ఉంటుందని నిరూపించుకుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆ సమయంలో అణుదాడుల బుకాయింపులు లేదా బెదిరింపులకు ఏమాత్రం వెరవకుండా తన లక్ష్యాలను భారత్ పూర్తి చేసిందని స్పష్టం చేశారు. ''ఇది 'కొత్త ప్రపంచ క్రమం'. నూతన ప్రపంచ శకంలో 'నవ భారతం' ఇది. ఉగ్రవాదానికి, దానికి మద్దతు తెలిపేవారికి మధ్య ఏమాత్రం వ్యత్యాసాన్ని చూపని భారతదేశమిది. మారుతున్న ప్రపంచ పరిణామాల నేపథ్యంలో భారత్‌లో పరివర్తనను సాధ్యం చేసిన ఎలాంటి సందిగ్ధం లేని ప్రధానమంత్రి విధానమిది" అని చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ భారత సైనిక శక్తికి నిలువుటద్దమని రక్షణ మంత్రి అభివర్ణించారు. కేవలం 72 గంటల్లోనే ఈ ఆపరేషన్‌ను ముగించినప్పటికీ.. దాని వెనుక విస్తృతమైన, సుదీర్ఘమైన సన్నద్ధత ఉందని తెలిపారు. వనరులను వేగంగా సమీకరించగలిగే శక్తి, దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాల విశ్వసనీయత.. అన్నీ ఇప్పుడు భారతీయ సైనిక యుద్ధ వ్యూహంలో ముఖ్యమైన భాగాలుగా మారాయని చెప్పారు.

ఆపరేషన్ సింధూర్ ఫలితంగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలు, రక్షణ ఉత్పత్తుల విశ్వసనీయత పట్ల ప్రపంచ దృష్టిలో మార్పు వచ్చిందని, సానుకూల ధోరణి కనిపిస్తోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ''భారత్ నుంచి ఆయుధాలు, రక్షణ సామగ్రిని కొనుగోలు చేసేందుకు అనేక దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. గణాంకాలన్నీ అదే చెబుతున్నాయి. ఆర్థిక సంవత్సరం 2025-26లో రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్లకు చేరుకున్నాయి. మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 62.66 శాతం వృద్ధి కనిపించింది. ఈ ప్రమాణాలను అధిగమించేలా మా ప్రయత్నాలను ముందుకు తీసుకెళుతున్నాం" అని తెలిపారు.

ఇటీవలే జర్మనీలో తాను చేపట్టిన పర్యటన గురించి ప్రస్తావిస్తూ.. ఐరోపా వ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థలు భారత ప్రైవేటు రంగంలోని రక్షణ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలతో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయనీ, ఇది భారత్‌పై పెరుగుతున్న విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. సైనిక పరాక్రమంతో మాత్రమే కాకుండా.. దాడులను నిరోధించే సైనిక సామర్థ్యంతో కూడా ప్రపంచంలో భారత్ స్థానం బలోపేతమవుతోందని తెలిపారు.

ఇటీవలి కాలంలో సైనిక విధానంలో వస్తున్న వేగవంతమైన మార్పుల గురించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. సైబర్ డొమైన్, స్పేస్ వార్‌ఫేర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రధానాంశాలుగా మారాయన్నారు. ఈ మార్పులకు కేంద్ర బిందువుగా కృత్రిమ మేధ (ఏఐ) ఉందని చెప్పారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్ లాంటి అత్యాధునిక క్షిపణుల నుంచి వివిధ పర్యవేక్షణా వ్యవస్థల వరకు ఏఐను సమర్థంగా వినియోగించాం. ఇది మన కచ్చితత్వాన్ని, దాడుల సామర్థ్యాన్ని పెంచింది. ప్రధాన కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తరచూ ప్రజలకు చేరుతున్నప్పటికీ, ముప్పు ఎదురు కాకముందే దాన్ని నిర్వీర్యం చేయడంలో అనేక చిన్నపాటి కార్యకలాపాలు, విధానాలు చురుగ్గా పని చేశాయి. ఇలాంటి సందర్భాల్లో ఏఐను విస్తృతంగా వినియోగించాం" అని రక్షణ మంత్రి వివరించారు.

ఏఐ వినియోగంలో ఆచరణాత్మకత గురించి రక్షణ మంత్రి వివరించారు. ఉగ్రవాదులను గురించడంలోనూ, వారి విషయంలో నిర్ణయాత్మకంగా స్పందించడంలోనూ కీలకంగా వ్యవహరించిందన్నారు. ''ఏఐ అంటే 'ఆగ్మెంటెడ్ ఇన్ఫాంట్రీ' అని కూడా. ఇది మన బలగాల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతోంది. ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా.. మన సైన్యాన్ని సాంకేతిక ఆధారితంగా, సమీకృత పోరాట యంత్రంగా మార్చే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నాం. దీనికోసం 'రుద్ర' బ్రిగేడ్లు, 'భైరవ్' బెటాలియన్లు, 'శక్తిబన్' ఆర్టిలరీ రెజిమెంట్లు అనే చురుకైన, స్వయం సమృద్ధమైన పోరాట విభాగాలను ఏర్పాటు చేశాం. అలాగే 'దివ్యాస్త్ర' బ్యాటరీలు ఆధునికమైన హైబ్రిడ్ ముప్పులకు తక్షణమే స్పందించే నిర్ణయాత్మక సామర్థ్యాన్ని పెంపొందించాయి.

పని సంస్కృతిని మార్చడానికి, సైనికుల సంక్షేమాన్ని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శక్తిమంతమైన సాధనంగా ఏఐ ఆవిర్భవించిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రక్షణ రంగంలో పింఛనుదారులు, మాజీ ఉద్యోగుల కోసం స్పర్శ్ పోర్టల్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. ఏఐ ఆధారిత చాట్‌బాట్లతో పింఛను సంబధిత ప్రక్రియలు సులభతరమయ్యాయని వెల్లడించారు. ఫిర్యాదుల పరిష్కారం నుంచి మెడికల్ రికార్డుల పర్యవేక్షణ వరకు అన్నింటి నిర్వహణ ఏఐ ఆధారంగా జరుగుతోందన్నారు. అదే విధంగా విద్య, ఆరోగ్య సేవల విషయంలో సైనికుల కుటుంబాలు వెనకబడిపోకుండా చూసేందుకు ఏఐ ఆధారిత సాధనాలను ఉపయోగిస్తున్నామని తెలియజేశారు.

నూతన ప్రపంచ క్రమంలో భారత వ్యూహాత్మక సన్నద్ధతలో విడదీయలేని భాగంగా ఏఐ మారిందని రక్షణ మంత్రి అన్నారు. ప్రభుత్వం దీనిని సైనికపరమైన కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేయకుండా దేశంలో నైపుణ్యాభివృద్ధి, పరిశోధనల కోసం సమగ్ర వ్యూహాన్ని రూపొందించిందని తెలియజేశారు. "ఇండియా ఏఐ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా కంప్యూటింగ్ మౌలిక వసతులను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మేం చురుగ్గా పనిచేస్తున్నాం. తద్వారా చిన్న పట్టణాలకు చెందిన యువత సైతం ఏఐకు తమ వంతు సహకారం అందించేలా కృషి చేస్తున్నాం. 10,000 జీపీయూ కంటే ఎక్కువ సామర్థ్యం, ఫ్యూచర్ స్కిల్స్ లాంటి కార్యక్రమాలు ఈ సాంకేతిక విప్లవ యుగంలో భారత్ వెనకబడిపోకూడదనే మా సంకల్పానికి నిదర్శనం. ఇటీవలే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు ? 2026ను విజయవంతంగా నిర్వహించాం. ఈ కార్యక్రమంలో 20 దేశాల అధినేతలతో పాటుగా, 89 దేశాలు, సంస్థలు పాల్గొన్నాయి. వీరంతా మన ఏఐ మ్యానిఫెస్టోను ఆమోదించారు. అంతర్జాతీయ ఏఐ ప్రమాణాలను రూపొందించడంలో భారత్ ప్రధాన పాత్రను పోషిస్తోంది. కొన్ని దేశాలకు మాత్రమే ఏఐ ప్రయోజనాలు పరిమితం కాకుండా.. గ్లోబల్ సౌత్‌కి కూడా అందేలా 'ఏఐ ఫర్ ఆల్' అనే మంత్రంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన వివరించారు.

డీప్‌ఫేక్‌లు, సైబర్ యుద్ధాలు, స్వతంత్ర ఆయుధ వ్యవస్థలు కొత్తవైన, ప్రమాదకరమైన సవాళు విసురుతున్నప్పటికీ ఏఐను అదే దృష్టితో చూడకూడదని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "రాబోయే రోజుల్లో ఈ సవాళ్లు మరింత తీవ్రం కానున్నాయి. కాబట్టి వాటిని మన దృష్టిలో ఉంచుకోవాలి. మన రక్షణ కోసం మనం రూపొందించుకున్న ఏఐపై నియంత్రణ కోల్పోతే.. అది ప్రమాదకరమైన ఆయుధంగా మారుతుంది. కాబట్టి మనల్ని నాశనం చేసేది కాకుండా.. నడిపించే శక్తిగా మార్చేందుకే మనం ప్రయత్నించాలి. సంఘటిత ప్రయత్నాలు, అంతర్జాతీయ సహకారం ద్వారా ఏఐ శక్తిని మనం సమర్థంగా వినియోగించుకోగలం'' అని చెప్పారు.

యుద్ధ క్షేత్రంలో నిఘా, స్వతంత్ర వ్యవస్థల నుంచి మెరుగైన రవాణా, కమాండ్ నిర్ణయాలకు మద్దతు అందించే వరకు వివిధ విభాగాల్లో ఏఐ పోషించే పాత్ర గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ''అత్యుత్తమ రీతిలో ఏఐ

# మత్తు అనర్థాలకు హేతువు : ఎస్పీ నరసింహ



నల్గొండ, మే1: డ్రగ్స్, గంజాయి వినియోగించడం వల్ల మత్తులో ఆలోచన విధానం కోల్పోయి అన్ని రకాల అనర్థాలకు కారణమవుతున్నారని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. గంజాయి రవాణా, సరఫరా, వినియోగం కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత గంజాయి డ్రగ్స్ మత్తులో నేరాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. అదేవిధంగా అనారోగ్యం బారిన పడుతూ భవిష్యత్‌ను కోల్పోతున్నారన్నారు. అందుకే ఈ గంజాయిని మన సమాజం నుండి లేకుండా పారదోలాలన్నారు.

మన పిల్లలను మన సమాజాన్ని ఈ గాంజాయి మత్తు నుండి కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. గంజాయి వినియోగించిన సరఫరా చేసిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గంజాయి వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంజాయి వినియోగిస్తున్న వారికి పోలీస్ స్టేషన్ లో డాక్టర్ల సహాయంతో మూత్ర పరీక్షలు చేయించారు. గంజాయి సంబంధ కేసుల్లో ఉన్న వ్యక్తులపై పోలీస్ శాఖ పటిష్టంగా నిఘా ఉంచిందని, కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం వీరుపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు.

డ్రగ్స్ గంజాయి వినియోగం, రవాణా కేసుల్లో చిక్కుకుంటే గరిష్టంగా 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష జరిమానా పడుతుందని తెలిపారు. ఇలాంటి వారిపై పోలీస్ స్టేషన్ల నందు హిస్టరీ షీట్స్ నమోదు చేస్తామని ఐదు లక్షల వరకు బైండోవర్ చేస్తామని పీడీ యాక్ట్ నమోదు చేసి రెండు సంవత్సరాలు జైలుకు పంపడం జరుగుతుందన్నారు. దీనికి అలవాటుపడి వారిలో మార్పు తేవడానికి పునరావాసం, సత్ప్రవర్తన డీ అడిక్షన్ కేంద్రాలకు పంపడం జరుగుతుందన్నారు. అనంతరం డ్రగ్స్ గంజా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ లు వెంకటయ్య, రాజశేఖర్, శివకుమార్, ఎన్ఐలు ఏడుకొండలు, శివతేజ, మహేందర్ నాథ్, సాయిరాం, వెంకన్న, ఎన్ఐలు శ్రీకాంత్, గోపికృష్ణ పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో ఇటలీ రక్షణ మంత్రితో భారత రక్షణ మంత్రి ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, మే1:ఇటలీ రక్షణ మంత్రి శ్రీ గైడో క్రోసెట్టోతో భారత రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ 2026 ఏప్రిల్ 30న న్యూఢిల్లీలోని మాణిక్‌షా సెంటర్‌లో ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. శాంతి, స్థిరత్వం, స్వేచ్ఛ, పరస్పర గౌరవం వంటి ఉమ్మడి విలువలు భారత్ - ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రాతిపదికలుగా ఉన్నాయని మంత్రులిద్దరూ స్పష్టం చేశారు.

పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులు సహా వివిధ ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై తాము చర్చించామని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో భారత రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఆత్మనిర్భర భారత్ కార్యక్రమం, ఇటలీ రక్షణ సహకార చర్యల ద్వారా పరస్పర ప్రయోజన కరమైన రక్షణ పారిశ్రామిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే మార్గాలను కూడా మంత్రులిద్దరూ చర్చించారు.

2026-27 సంవత్సరానికి సంబంధించి ద్వైపాక్షిక సైనిక సహకార ప్రణాళికను ఈ సమావేశంలో పరస్పరం మార్చుకున్నారు. ఇది ఇరు దేశాల రక్షణ దళాల మధ్య సైనిక కార్యకలాపాలకు మార్గనిర్దేశం చేస్తుంది.

గురుగ్రామ్‌లోని హిందూ మహాసముద్ర ప్రాంత సమాచార సంలీన కేంద్రం ద్వారా సమాచార వినిమయం సహా వివిధ కీలక సముద్ర అంశాలపై ఈ రెండు ప్రాచీన సముద్రయాన దేశాల మధ్య సమన్వయం కుదిరిందని వివరించారు.

సమావేశానికి ముందు ఇటలీ రక్షణ మంత్రి జాతీయ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, దేశసేవలో ప్రాణాలర్పించిన వీరయోధులకు నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా ఇటలీ రక్షణ మంత్రి మాణిక్ షా కేంద్రంలో త్రివిధ దళాల గౌరవ వందనాన్ని కూడా స్వీకరించారు.

# పంటల మార్పిడి తప్పకుండా చేయాలి : సి.హెచ్.పల్లవి



నల్గొండ, మే1:పంటల మార్పిడి తప్పకుండా చేయాలి. యూరియా వాడకాన్ని తగ్గించాలి అని డా. సి.హెచ్.పల్లవి అన్నారు. ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్వర్యంలో మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు, వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని రైతువేదికలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సిద్దిపేట, వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నల వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సోద రులకు ఆరు అంశాలపై అవగాహన కల్పించా మన్నారు. ముఖ్యంగా ఈ అవగాహన కార్యక్రమం లో భాగంగా వాడకాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని, రసాయనాలను అవసరం మేరకు వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, పంట మార్పిడి పాటించడం ద్వారా స్థిర ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డా. డి.శ్వేత, నరేష్, హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారిని రజిత, స్వర్ణలత, ప్రవీణ్, సర్పంచ్ మాసంపల్లి రాజు, దిశా కమిటీ సభ్యుడు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా ఏకం కావాలి

మహబూబ్‌నగర్, మే1: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. మేడే ఉత్సవాల సందర్భంగా మాగనూరు మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భరత్ కుమార్ జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 100 సంవత్సరాల క్రితం నుండి బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దుచేసిందని ఆరోపించారు. కొత్తగా 4 లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు.

కార్మిక వర్గానికి సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితమయ్యే హక్కు , కనీస వేతనం అడిగే హక్కు, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలకు నోచుకోకుండా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక వర్గం ఐక్యతగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అశోక్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొల్పూర్ నర్సింలు , బోయ రవి, ముష్టి వెంకటయ్య ,డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బాలరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వాకిటి వెంకటయ్య, ఆంజనేయులు, ఈడిగే రాజు, హమాలి యూనియన్ నాయకులు లంగటి శేఖర్, బ్యాగరి వాబయ్య, దాసరపల్లి అశోక్, కేవీపీఎస్ మండల నాయకులు బి నర్సింలు, వాకిటి హనుమంతు, పాటిమీద ఆనంద్ , తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్‌కు 'బాల భరోసా' ఒక వరం : కలెక్టర్ అంకిత్



ఖమ్మం, మే1: స్థానిక జిల్లా కేంద్రంలోని రామవరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా సంక్షేమ అధికారిణి జె.స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "బాల భరోస" కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాటాడుతూ.. చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా, వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను తొలి దశలోనే గుర్తించి నివారించేందుకు 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బాల భరోసా' కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యంగా సున్నా నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, పిల్లల్లో ఉండే,న్యూరో డెవలప్‌మెంట్ (నాడీ వ్యవస్థ సంబంధిత) సమస్యలు, శారీరక ఎదుగుదల లోపాలు, మానసిక వికాసంలో ఆలస్యం వంటి అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని, దానికి అనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలన్నారు.

బాల భరోస కార్యక్రమం ముఖ్య ఉద్దేశం సకాలంలో జోక్యం అని పిల్లలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే, వెంటనే వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించి, ఆ సమస్య తీవ్రతరం కాకుండా చూడాలన్నారు. ప్రతి చిన్నారి శారీరక, మానసిక స్థితిని నిశితంగా పరిశీలించి, అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించడం. చిన్నారులు ఆరోగ్యంగా, సంతోషంగా పెరిగేలా చూడటవమే కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె.స్వర్ణలత లేనినా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2061 కేంద్రాలలో నమోదైన సున్నా నుండి ఐదు సంవత్సరాల లోపు అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదైన పిల్లలను ఆర్బిఎస్కే టీముల ద్వారా ముందస్తు అనారోగ్య గుర్తింపులో భాగంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం ద్వారా జిల్లాలో ఉన్న 60,000 మంది చిన్నారులను 42 ప్రశ్నల ద్వారా ఆన్‌లైన్ పోర్టర్లలో వివరాలను నమోదు చేయడం జరిగిందని, దానికి అనుగుణంగా పిల్లల అభివృద్ధిలో వెనకడుగు, న్యూరో డెవలప్‌మెంట్, శారీరక లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి ఈరోజు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ గారి నేతృత్వంలో ప్రత్యేక పర్యవేక్షణతో కూడిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఈ ఒక్క అవకాశాన్ని సద్వినియోగం ఈరోజు మాత్రమే చేసుకోకుండా సూచించిన తేదీలలో క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు నిర్వహించుకోవాలని, అంగన్‌వాడీ టీచర్లను సకాలంలో జోక్యం చేసుకొని స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలలో చికిత్స అందించి పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, సంతోషంగా, సురక్షితమైన భవిష్యత్‌ను నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు అందిస్తున్న సేవలను మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని, మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి సూచనలు జారీ చేయడం జరిగింది. తదుపరి ''బేటి బచావో'' కార్యక్రమంలో భాగంగా "భేటీ జన్మోత్సవ్"నిర్వహించి నెలలోపు జన్మించిన ఆడపిల్లలకు బేటి జన్మోత్సవ్ కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ ప్రతాప్, డాక్టర్ వినోద్, నాగభూషణం, పీడియాట్రిషన్ డాక్టర్లు, జిల్లా స్థాయి ఆర్బిఎస్కే సిబ్బంది, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త వి.సంపత్, సిడిపిఓలు లక్ష్మి ప్రసన్న, వెంకటరమణ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ సంపదను సృష్టించేది కార్మికులే : ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మెదక్, మే1:దేశ సంపదను సృష్టించేది కార్మికుల రెక్కల కష్టమేనని, కార్మికుల త్యాగాలు అమూల్యమైనవని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మేడే సందర్భంగా సివిల్ సప్లయ్ గోదాం వద్ద హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే బాబు మియా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఉత్పత్తి రంగంలో కార్మికులు భాగం పంచుకుని దేశ సంపదను సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు మియా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్, నాయకులు కొత్తగొల్ల కృష్ణ, నాగుల విజయ్‌కుమార్, కార్మికులు ఎస్కే ఖుర్షిద్ పాషా, ప్రభు, యేసురత్నం, ఎండీ వాహెద్, ఎస్కే పాషా మియా, వెంకటేశ, ఔసాద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ (యూఎస్‌బీఆర్‌ఎల్) పరిధిలోని అంజి ఖాడ్-చెనాబ్ వంతెనలను తనిఖీ చేసిన మంత్రి

న్యూఢిల్లీ, మే1:జమ్మూలో రైలెక్కితే నేరుగా శ్రీనగర్ చేరుకోవాలనే ప్రజానీకం స్వప్నం ఊహలకే ఎక్కువగా పరిమితమైపోయింది. అయితే, ఇది ఒకప్పటి మాట... ఈ రోజున అటువంటి ఆలోచన గతకాలపు జ్ఞాపకంగా మారి, చరిత్రగా మారింది. ఈ మేరకు జమ్మూ తావి రైల్వే స్టేషన్ వరకు విస్తరించిన శ్రీనగర్?శ్రీ మాతా వైష్ణో దేవి కాత్రా వందే భారత్ ఎక్స్ ప్రెస్‌ను రైల్వేశాఖ మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ప్రారంభించారు. దీంతో తొలిసారిగా జమ్మూ, కాశ్మీర్‌ల మధ్య ప్రయాణిక రైలు ద్వారా ప్రత్యక్ష సంధానం వాస్తవ రూపం దాల్చింది. నిరంతరం ప్రయాణించే ఈ రైలు రెండు అత్యంత ప్రతిష్టాత్మక గమ్యాలను ఇలా కలుపుతుంది. ఇది వేగవంతమైన ప్రయాణానుభవం ఇవ్వడమే కాకుండా, అద్భుత ప్రకృతి నేపథ్యంతో ప్రజలు, వాణిజ్యం, పర్యాటక రంగాలు మమేకం కావడంలో ఒక వినూత్న పరిణామానికి నాంది పలుకుతుంది.

రైల్వే రంగానికి కీలక ప్రవేశ ద్వారంగా జమ్మూ తావి

ఉత్తర భారతంలోని అత్యంత కీలక రైల్వే స్టేషన్లలో జమ్మూ తావి ఒకటి. ఈ కేంద్రపాలిత ప్రాంతాన్ని దేశంలోని మిగిలిన ప్రాంతాలతో కలిపే ప్రధాన ప్రవేశ ద్వారంగా ఇది ఉపయో గపడుతుంది. కన్యాకుమారి, హౌరా, ముంబయి సహా ఇతర మహా నగరాల వంటి ప్రధాన గమ్యాలకు విస్తృత రైలు సంధానంతో ఈ ప్రాంతాల మధ్య నిరంతర రవాణాకు భరోసా ఇవ్వడంలో ఈ స్టేషన్ ముఖ్య పాత్ర పోషిస్తుంది.

ఈ రైలును ప్రారంభించిన సందర్భంగా తాజా పరిణామాల ప్రాధాన్యాన్ని తన ప్రసంగంలో వివరిస్తూ- జమ్మూ కాశ్మీర్‌లో రైలు సంధాన విస్తరణతో రైల్వేల చరిత్రలో ఓ కీలక ఘట్టం నమోదైందని మంత్రి శ్రీ వైష్ణవ్ పేర్కొన్నారు.

ఈ రైలు ఇప్పుడు జమ్మూ తావి వరకూ ప్రయాణిస్తుంది కాబట్టి, దేశవ్యాప్తంగాగల ప్రయాణికులు శ్రీ మాతా వైష్ణో దేవి, శ్రీ అమర్‌నాథ్ వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలకు సులభంగా, సౌకర్యవంతంగా చేరుకోగలరని చెప్పారు.

వందే భారత్ సర్వీసు ఆరంభం నుంచే పూర్తి స్థాయిలో నిండుగా ప్రయాణిస్తున్నదని, ఈ రైలుకు పెరుగుతున్న ప్రజాదరణకు ఇది సంకేతమని రైల్వేశాఖ మంత్రి చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌తో పాటు దేశంలోని మిగిలిన ప్రాంతాలకూ ఇది జీవనాడిగా ప్రాముఖ్యం సంతరించుకుంటున్నదని గుర్తుచేశారు. ఆ మేరకు ఈ రోజు జమ్మూ-శ్రీనగర్ మధ్య 20 కోచ్‌లతో వందే భారత్ ఎక్స్ ప్రెస్ సర్వీసును ప్రారంభించామని తెలిపారు. ఈ కీలక మార్గంలో ప్రయాణికుల సామర్థ్యం గణనీయంగా పెరగడాన్ని ఈ పరిణామం సూచిస్తున్నదని ఆయన చెప్పారు.

గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గత ఏడాది జూన్ 6న జమ్మూ-శ్రీనగర్ రైలు మార్గాన్ని ప్రారంభించిన ఏడాది లోపే ఈ పరిణామం చోటు చేసుకోవడం హర్షదాయ కమన్నారు. ఈ ప్రాంతంలో నిరంతర రైల్వే సంధానానికి ఇది పునాది వేసిందని రైల్వేశాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. వందే భారత్ సర్వీసును విస్తరించడంతో ఈ చారిత్రక కారిడార్ మరింత బలోపేతం కాగలదని, ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని చెప్పారు. తద్వారా ప్రయాణిక డిమాండ్‌ను తీరుస్తూ జమ్మూ, శ్రీనగర్ మధ్య అన్ని కాలాల్లోనూ అనుసంధానాన్ని పటిష్టం చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో సున్నా డిగ్రీల కన్నా తక్కువ ఉష్ణోగ్రత సహా కఠిన వాతావరణ పరిస్థితులలో నడపేందుకు తగినట్లుగా ఈ రైలును ప్రత్యేకంగా రూపొందించారని తెలిపారు. అలాగే, రైలులోని పరికరాలు నిరంతరాయం పనిచేసేలా ప్రత్యేక వ్యవస్థలను అమర్చినట్లు చెప్పారు.

ఈ రైలులో అధునాతన ఎలక్ట్రానిక్స్, హై-ఎండ్ సెమీకండక్టర్ ఆధారిత వ్యవస్థలను పొందుపరిచారని, దీంతో అత్యంత ఆధునికమైన, సాంకేతికంగా అధునాతన రవాణా సాధనంగా ఇది రూపొందిందని శ్రీ వైష్ణవ్ ప్రముఖంగా వివరించారు. రైలులో డోగ్రీ వంటకాలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రయాణికులకు ప్రాంతీయ సంస్కృతిని అనుభవంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ మార్గంలో ప్రయాణికులకు జమ్మూకాశ్మీర్ సంస్కృతి, ప్రకృతి సౌందర్యం, భాష, సంగీతం, పాక సంప్రదాయాలతో పరిచయం ఏర్పడుతుందన్నారు. తద్వారా వారి ప్రయాణం మరింత సుసంపన్నం అవుతుందని శ్రీ వైష్ణవ్ అన్నారు.

**జమ్మూకాశ్మీర్... భూలోక స్వర్గం**

"భూలోక స్వర్గం"గా ప్రపంచం అభివర్ణించే జమ్మూకాశ్మీర్ తన అద్భుత సహజ సౌందర్యం, మంచు నిండిన పర్వతాలు, పచ్చని లోయలు, ప్రశాంత సరస్సులకు ప్రసిద్ధి చెందింది. ఆప్యాయత, దృఢ సంకల్పం గల సమాజాలకు ఈ ప్రాంతం నిలయం. వారి గొప్ప సాంస్కృతిక వారసత్వం ఈ ప్రాంతానికొక ప్రత్యేక గుర్తింపునిస్తుంది. రైల్వే సంధానం మెరుగవడంతో పర్యాటకం మరింత వృద్ధి చెందుతుందని చెప్పారు. తద్వారా దేశవ్యాప్తంగా మరింతమంది ప్రజలకు ఈ ప్రాంత సుందర దృశ్యాలు, సాంస్కృతిక వైభవం అనుభవంలోకి వస్తుందని భావిస్తున్నారు.

మెరుగైన రైల్వే మౌలిక సదుపాయాలు స్థానిక ఉత్పత్తులకు రవాణా సౌలభ్యం కల్పించడంతోపాటు ఆర్థిక వృద్ధికీ దోహదం చేస్తాయని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. నాణ్యమైన డ్రై ఫ్రూట్స్, సున్నితమైన పష్మీనా శాలువలు, ఆపిల్, సంప్రదాయ చేనేత తివాచీల (కలీన్)కు జమ్మూ కాశ్మీర్ ప్రసిద్ధి. వీటన్నిటికీ దేశవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. రైలు మార్గ సంధానం మెరుగుతో ఇప్పుడు వీటన్నిటినీ జాతీయ మార్కెట్లకు వేగంగా, సమర్థంగా చేర్చడం వీలవుతుంది. తద్వారా స్థానిక జీవనోపాధికి మద్దతు సహా వాణిజ్య అవకాశాలు కూడా విస్తరిస్తాయి.

ఇంతటి ఎత్తైన ప్రదేశాలలో రైల్వే కార్యకలాపాలను నిర్వహించే విషయంలో భారత్‌కు ఇదే తొలి అనుభవమని.. ఇక్కడ నేర్చుకున్న విషయాలు భవిష్యత్తులో చేపట్టే మౌలిక వసతుల అభివృద్ధికి మార్గదర్శకంగా ఉంటాయని శ్రీ అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ రైల్వే మార్గం ఈ ప్రాంతంలో రవాణా ఖర్చులను తగ్గించి సరుకు రవాణాను గణనీయంగా మెరుగుపరచటంతో పాటు ఎరువులు, పాల వంటి అవసరమైన డెయిరీ ఉత్పత్తుల రవాణాను సజావుగా జరిగేలా చూస్తోందని ఆయన తెలిపారు. అంతేకాకుండా చెర్రీస్ వంటి వ్యవసాయ ఉత్పత్తులను కూడా పార్శిల్ సేవల ద్వారా రవాణా చేయడం వల్ల స్థానిక రైతులకు మార్కెట్ అవకాశాలు మరింత మెరుగయ్యాయని అన్నారు.

ఈ రైలు నెట్‌వర్క్ రవాణాను సరళతరం చేయడమే కాకుండా ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలకు దోహదపడిందని ఆయన ఉద్ఘాటించారు. భవిష్యత్తులో హిమాలయ ప్రాంతంలో భద్రత, విశ్వసనీయతను నిర్ధారించడానికి నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయడం, వంతెనల -సొరంగాల కోసం అధునాతన సాంకేతికతలను ఉపయోగించడంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

కాశ్మీర్ లోయలో రైలు సరుకు రవాణా, ఆర్థిక సంబంధాలు

ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లైన్ (యూఎన్‌బీఆర్‌ఎల్) పూర్తి కావడంతో కాశ్మీర్ లోయ భారత్‌లోని మిగిలిన రైల్వే నెట్‌వర్క్‌తో సజావుగా అనుసంధానమైంది. ఇది ప్రయాణికులకు ప్రయోజనాన్ని చేకూర్చడమే కాకుండా ఈ ప్రాంతంలో వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలను కూడా గణనీయ ంగా పెంచింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన అయిన చీనాబ్ రైల్ బ్రిడ్జ్, అంజి ఖాద్ బ్రిడ్జ్ వంటి ఇంజనీరింగ్ అద్భుతాలు ఈ ప్రాంతానికి నిరంతర, అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ రైల్వే సౌకర్యాన్ని అందించాయి. ఈ పరివర్తనాత్మక మౌలిక సదుపాయాలు క్రమబద్ధమైన సరుకు రవాణాకు మార్గం సుగమం చేశాయి. ఇది రవాణా సమయాన్ని గణనీయంగా తగ్గించి విశ్వసనీయతను మెరుగుపరిచింది. ఇది జాతీయ సరఫరా గొలుసులతో ఈ లోయను మరింత సన్నిహితంగా అనుసంధానం చేసింది.

జమ్మూ-శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే మంత్రి జమ్మూ నుంచి కత్రా వరకు ప్రయాణించారు. రైలులో ప్రయాణిస్తూ ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఇప్పటికే దాదాపు 2 కోట్ల కిలోల సేపులను రైల్వే నెట్‌వర్క్ ద్వారా శ్రీనగర్ నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేసినట్లు తెలిపారు.

ఆ తర్వాత శ్రీ అశ్వినీ వైష్ణవ్ అంజి ఖాద్ వంతెన, చీనాబ్ రైల్ వంతెనలను పరిశీలించారు.

జమ్మూ కాశ్మీర్‌లో మెరుగైన రైలు అనుసంధానం వల్ల సరుకు రవాణా కార్యకలాపాలు గణనీయంగా మెరుగుపడ్డాయని.. ఇది నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడానికి దోహదపడిందని రైల్వే మంత్రి పేర్కొన్నారు. మెరుగైన రవాణా సామర్థ్యం వల్ల వస్తువులు మరింత తక్కువ ధరలకు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. అందులో భాగంగా సిమెంట్ రవాణా ఖర్చులు తగ్గడంతో ఒక్కో సంచిపై రూ. 50 వరకు తగ్గాయని.. ఇది ఆ ప్రాంతంలో రైలు ఆధారిత సరఫరా గొలుసుల మెరుగుదలపై ఉన్న సానుకూల ప్రభావాన్ని తెలియజేస్తోందని ఆయన అన్నారు.

ఈ నెల ప్రారంభంలో పశ్చిమ రైల్వేకు చెందిన అహ్మదావాద్ డివిజన్.. జమ్మూ కాశ్మీర్‌కు పాల ఉత్పత్తులను తీసుకెళ్లే మొదటి కార్గో రేక్‌ను పంపింది. ఇది సుదూర సరుకు రవాణా అనుసంధానంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. అలాగే ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్.. కాశ్మీర్ లోయలో తన కార్యకలాపాలను ప్రారంభించి ఆదర్శ నగర్, బుద్గామ్ మధ్య రోజువారీ సరుకు రవాణాను ఏర్పాటు చేసింది. దీని ద్వారా 30 గంటల లోపే ఇరువైపుల రవాణా సాధ్యమవుతోంది. సరఫరా గొలుసును మరింత బలోపేతం చేస్తూ అంబాలా నుంచి అనంతనాగ్‌కు మొదటి వర్మికంపోస్ట్ ఎరువుల వ్యాగన్ చేరేలా జమ్మూ డివిజన్ చర్యలు తీసుకుంది.

ఈ ఏడాది జనవరిలో 2,768 మెట్రిక్ టన్నుల బియ్యంతో ఉన్న 42 వ్యాగన్లతో కూడిన మొదటి పూర్తి రేక్ అనంతనాగ్‌కు చేరుకుంది. గత ఏడాది డిసెంబర్‌లో దాదాపు 1,384 టన్నుల ఆహార ధాన్యాలను తీసుకెళ్తున్న మొదటి ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ) సరుకు రవాణా రైలు అనంతనాగ్ గూడ్స్ టెర్మినల్‌కు చేరుకుంది. అంతకుముందు గత ఏడాది అక్టోబర్‌లో 1,350 టన్నుల పారిశ్రామిక ఉప్పుతో గుజరాత్‌లోని ఖరాఘోడా నుంచి ప్రారంభమైన మొదటి రైలు అనంతనాగ్‌కు చేరుకుంది. ఈ పరిణామాలు ఈ ప్రాంతంలో పెరుగుతున్న సరుకు రవాణా కార్యకలాపాలను ప్రధానంగా తెలియజేస్తున్నాయి.

భవిష్యత్తు విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి

పెరుగుతున్న రద్దీని తట్టుకోవడానికి జమ్మూ తావి స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని.. ఇందులో భాగంగా ప్లాట్‌ఫాంల విస్తరణ, అదనపు ప్రవేశ ద్వారాలు, మెరుగైన ప్రయాణికుల సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు లైన్ డబ్లింగ్, కీలకమైన మార్గాల్లో సామర్థ్యాన్ని పెంపొందించడంతో సహా విస్తృత మౌలిక సదుపాయాల కార్యక్రమాలు జమ్మూ కాశ్మీర్, దేశంలోని ఇతర ప్రాంతాల మధ్య అనుసంధానతను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

జలంధర్ -జమ్మూ విభాగంలో డబ్లింగ్ పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఢిల్లీ?అంబాలా విభాగాన్ని నాలుగు లైన్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పిన ఆయన.. దీనికి ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. సామర్థ్యాన్ని పెంచేందుకు ఖాజీగుండ్, బారాముల్లా మధ్య రైల్వే లైన్ డబ్లింగ్ పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పూంచ్?రాజౌరీ రైల్ లింక్, ఉరీ?బారాముల్లా పొడిగింపు వంటి ప్రాజెక్టులు ప్రస్తుతం ప్రణాళిక, సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) దశలలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.

ఖాజీగుండ్-బారాముల్లా లైన్ డబ్లింగ్.. కాశ్మీర్ లోయ గుండా సరుకు, ప్రయాణికుల రవాణా సామర్థ్యాన్ని పెంచటంతో పాటు రద్దీని తగ్గిస్తుంది. ఇది ప్రయాణ సమయాన్ని తగ్గించి.. వస్తువులు, పర్యాటకుల రాకపోకలను సులభతరం చేస్తుంది. చారిత్రాత్మకంగా తగినంత ప్రాతినిధ్యం లేని రెండు జిల్లాలను మొదటిసారిగా జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానిస్తుంది. ఇది స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ, విద్య విషయంలో మెరుగైన సదుపాయాలను అందిస్తుంది. అలాగే ఉరీ?బారాముల్లాను పొడగించటం వల్ల సరిహద్దు దిశగా రైలు సౌకర్యం మరింత పెరుగుతుంది. ఇది మారుమూల ప్రాంతాలను పర్యాటకం, వాణిజ్యాలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రజల స్థైర్యాన్ని బలపరుస్తుంది.

ఈ ప్రాజెక్టులన్నీ కలిసి ఈ ప్రాంతంతో రోడ్డు రవాణాపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. ఇక్కడ కొండచరియలు విరిగిపడటం, భారీగా మంచు కురవడం, తీవ్రమైన శీతాకాల పరిస్థితుల వల్ల రోడ్డు రవాణా తరచుగా అంతరాయాలకు గురవుతుంటుంది. ఇవి పెట్టుబడులను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఈ ప్రాంతం అంతటా ఉన్న వర్గాలకు సామాజిక- ఆర్థిక సమగ్రతను పెంపొందించడంలో తోడ్పడతాయి.

శ్రీనగర్-కత్రా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను జమ్మూ తావి వరకు పొడిగించడం అనేది ఈ ప్రాంతాన్ని జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో మరింతగా అనుసంధానించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, వాణిజ్యాన్ని సులభతరం చేయడం, మొత్తం అనుసంధానాన్ని మెరుగుపరచడం వైపు వేసిన మరో అడుగు. దేశంలోని అన్ని ప్రధాన కేంద్రాలతో అన్ని వైపుల నుంచి జమ్మూ బాగా అనుసంధానమై ఉంది. జమ్మూలో అనుకూలమైన ఇంటర్‌చేంజ్ ఉండటం వల్ల దేశం నలుమూలల నుంచి వచ్చే ప్రయాణికులు ఇప్పుడు కాశ్మీర్ లోయను సులభంగా చేరుకోవచ్చు. ఈ అభివృద్ధి ప్రజల మధ్య సంబంధాలను మరింతగా పెంచడానికి.. దేశంలోని ఇతర ప్రాంతాలతో కాశ్మీర్ లోతైన ఆర్థిక అనుసంధానానికి మార్గం సుగమం చేస్తోంది.

# అబద్ధపు ప్రచారంతో పెన్షనర్లను మోసం చేస్తున్న ప్రభుత్వం

**-రూ.వెయ్యి కోట్లు ఎవరికి ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలి**

**-బకాయిల సాధన సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పొనుగోటి కోటయ్య**

నల్గొండ, మే1: 2024 మార్చి నుండి రిటైరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రూ.1,000 కోట్లు విడుదల చేశామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అవాస్తవమని, ఇది పెన్షనర్లను మోసం చేయడమేనని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, 2024 బకాయిల సాధన సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పొనుగోటి కోటయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనపై ఆయన మండిపడ్డారు. ?2025 అక్టోబర్ వరకు జీపీఎఫ్, పీఆర్సీ ఏరియర్స్, జీఐఎస్, టీఎస్జీఎల్ఐ చెల్లిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేసి పెన్షనర్లను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు.

ప్రభుత్వం రూ.1,000 కోట్లు ఎవరికి ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరవై ఏళ్లు దాటిన ఉద్యోగులు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నా, నిరాహార దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మొండి వైఖరిని వీడి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను ఏకమొత్తంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో భావ్‌సింగ్, నాగేశ్వరరావు, రమేష్ బాబు, భిక్షం, మణిరాం, లక్ష్మీనరసయ్య, హుస్సేన్, కోటయ్య, జాఫర్, దస్తగిరి పాల్గొన్నారు.

# కోదాడ వాసికి శ్రమశక్తి అవార్డు

నల్గొండ, మే1: కార్మికుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడే వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే శ్రమశక్తి అవార్డు కోదాడ పట్టణానికి చెందిన కందిబండ వెంకటేశ్వరరావు పొందారు. విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు గత 30 సంవత్సరాలుగా యూనియన్ లో పట్టణ స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో వివిధ హోదాలలో పనిచేస్తూ కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుంటూ కార్మికుల మన్ననలను పొందాడు. 1991లో విద్యుత్ శాఖలో ఉద్యోగాన్ని పొందిన వెంకటేశ్వరరావు గత 35 సంవత్సరాలుగా తోటి కార్మికులు, క్రింది స్థాయి కార్మికుల సంక్షేమానికి కృషి చేయటం వల్ల శుక్రవారం హైదరాబాద్ రవీంద్ర భారతీలో జరిగిన కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డును పొందినట్లు ఆయన తెలిపారు. అవార్డు గ్రహీతను మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, పీసీసీ డెలిగేట్ చింతకుంట లక్ష్మీనారాయణ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు, ఆవోప జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రమేష్, పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం, వానవీ క్లబ్స్ నాయకులు, బాధ్యులు అభినందించారు.

# నిజామాబాద్ జిల్లాలో ఒంటిపై డీజిల్ పోసుకొని రైతు ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్, మే1: కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతు డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడికాపు కాస్తున్నా ధాన్యం కొనడం లేదని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పల్లి సర్పంచ్ భర్త మఠంల శేఖర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన పోలీసులు అతడిని అడ్డుకున్నారు. కాగా, గ్రామ రైతులు రోడ్డుపై ధాన్యం పోసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళన భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# హమాలి కార్మికులకు చల్లటి ఫిల్టర్ వాటర్ సరఫరా




కామారెడ్డి, మే1: మేడేను పురస్కరించుకుని మొహ్మదాబాద్ గ్రామ సర్పంచ్ సుర్నర్ శకుంతల బాలుసార్ హమాలి కార్మికులకు 20 డబ్బాల చల్లటి ఫిల్టర్ వాటర్ త్రాగటానికి పంపిణీ చేశారు.సింగిల్ విండో ద్వారా గ్రామ శివర్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం కొనసాగుతుంది.ఈ కేంద్రంలో వరి తూకం చేసేందుకు పదుల సంఖ్యలో కార్మికులు ప్రతిరోజు హమాలిపని నిర్వహిస్తున్నారు.వరి ధాన్యం కొనుగోలు ముగింపు వరకు ప్రతిరోజు 20 డబ్బల చొప్పున ఫిల్టర్ మంచినీటిని కార్మికుల దాహం తీర్చేందుకు సరఫరా చేయటం జరుగుతుందని సర్పంచ్ సుర్నర్ శకుంతల తెలిపారు .హమాలీలకు,రైతులకు మంచినీటి సరఫరా చేయటంపై గ్రామస్తులు కూడా హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ పోతుల లక్ష్మణ్,కార్యదర్శి ఎన్ జీవన్,వార్డుస భ్యులు,విండో ఉద్యోగి రాకేష్ గౌడ్,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-కేడీసీసీ చైర్మన్ మాజీమంత్రి నెట్టెం రఘురాం**

**-చిలకల్లు లో ఘనంగా మేడే వేడుకలు..**

**-పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులు**

అమరావతి, మే1: చిల్లకల్లు ఆటో వర్కర్స్ యూనియన్ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ఆధ్వర్యంలో ఆటో




స్టాండ్ సెంటర్ వద్ద అంతర్జాతీయ కార్మిక దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ , జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ , ఎన్టీఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎం.సి.హెచ్ శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా కమ్యూనిస్టు ప్రముఖుడు పుచలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ, మే డే కార్మికుల హక్కుల సాధనకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

శ్రామికుల సంఘటిత శక్తి సమాజ అభివృద్ధికి కీలకమని, దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే బలమైన పునాది అని అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.భవన ఇతర నిర్మాణ కార్మికులలో 18.25 లక్షల మందిని నమోదు చేసి, వివాహ కానుకగా రూ 20,000, ప్రసూతి సహాయం రూ 20,000, సహజ మరణానికి రూ 60,000, అంత్యక్రియల ఖర్చులకు రూ 20,000 అందజేస్తున్నట్లు వివరించారు. అలాగే అసంఘటిత రంగానికి చెందిన 88.53 లక్షల కార్మికులను నమోదు చేసి సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా అందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్నా క్యాంటీన్ల ద్వారా రూ 5కే నాణ్యమైన భోజనం అందిస్తూ కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుప రచాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "స్వర్ణాంధ్ర 2047" లక్ష్య సాధనలో శ్రామికులే కీలక శక్తి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రావూరు విశ్వనాథం, మండల టిడిపి అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, మండల సమైక్య అధ్యక్షురాలు నాయిని రజిని, ముత్తినేని అశోక్, రావూరి శ్రీనివాసరావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఆలూరి రమణ, ఎల్ఎస్‌సిఎస్ అధ్యక్షులు ధూళిపాళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. యూనియన్ అధ్యక్షుడు బత్తుల బ్రహ్మం అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు షేక్ అల్లావుద్దీన్, కార్యదర్శి ఎస్కె రజావాలి, కోశాధికారి అబ్బురం మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా ఏకం కావాలి




మహబూబ్‌నగర్, మే1: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. మేడే ఉత్సవాల సందర్భంగా మాగనూరు మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భరత్ కుమార్ జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 100 సంవత్సరాల క్రితం నుండి బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దుచేసిందని ఆరోపించారు. కొత్తగా 4 లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు.

కార్మిక వర్గానికి సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితమయ్యే హక్కు , కనీస వేతనం అడిగే హక్కు, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలకు నోచుకోకుండా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక వర్గం ఐక్యతగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అశోక్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కోల్పూర్ నర్సింలు , బోయ రవి, ముష్టి వెంకటయ్య ,డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బాలరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వాకిటి వెంకటయ్య, ఆంజనేయులు, ఈడిగే రాజు, హమాలి యూనియన్ నాయకులు లంగటి శేఖర్, బ్యాగరి వాబయ్య, దాసరపల్లి అశోక్, కేవీపీఎస్ మండల నాయకులు బి నర్సింలు, వాకిటి హనుమంతు, పాటి మీద ఆనంద్ , పాల్గొన్నారు.

# సమాజ సేవలో మమేకమైన పద్మజా నాయుడు

## మే 2...పద్మజా నాయుడు వర్ధంతి

పద్మజా నాయుడు (నవంబర్ 17, 1900 ? మే 2, 1975) స్వాతంత్ర్య సమర యోధురాలు, కవయిత్రి, సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ గా పని చేసిన మహిళ. ఆమె హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సంయుక్త వ్యవస్థాపకురాలు. పురుషుల ఆధిపత్య ప్రజా రంగంలో, సామాజిక సేవకురాలిగా, రాజకీయ నాయకురాలిగా, పాలకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.

పద్మజా నాయుడు 1900 నవంబర్ 17న హైదరాబాద్‌లో జన్మించారు. ఆమె (బెంగాలీ) తల్లి ప్రఖ్యాత కవి, భారత స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజిని నాయుడు. ఆమె (తెలుగు) తండ్రి ముత్యాల గోవిందరాజులు నాయుడు వైద్యుడు. ఆమెకు జైసూర్య, లీలమణి, ఆదిత్య, రణధీర అనే నలుగురు తోబుట్టువులు.

పద్మజా నాయుడు పెద్దగా చదువు కోలేదు. చిన్ననాడు చేరిన మహబూబియా బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగేళ్ళు మాత్రమే చదివారు. బాల్యంలో తరుచుగా అనారోగ్యానికి గురికావడంతో ఆమె చదువు సరిగా సాగలేక పోయింది. ఆమె నేర్చుకున్న విద్య, సంస్కారం అంతా తన తల్లి నివాసమైన గోల్డెన్ థ్రెషోల్డ్‌కు వచ్చి పోయే వారి మధ్యే సాగి పోయింది.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వర్క్స్ శాఖను ఏర్పాటు చేసి ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణకై ఆమె ఎంతో మంది ముస్లిం స్త్రీలను సభ్యులుగా చేర్చుకొని ప్లేగు రిలీఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. పౌరుల స్వేచ్ఛ కొరకు, జాగిర్దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా స్థాపించ బడిన స్వదేశీ లీగ్ అనే సంస్థకు అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే, ఆమె తన సంపాదకత్వంలో 'వన్ వరల్డ్' అనే పత్రికను నడిపారు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సామ్యవాద సిద్ధాంతానికి ప్రభావితులైన కొందరు ఉస్మానియా విద్యార్థులు కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించగా, సంస్థకు పద్మజా నాయుడు సహకారాన్ని అందించారు. 1935లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడి నప్పుడు, రైతుల దుర్భర పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి ఏర్పడిన హైదరాబాద్ సహాయక సంఘానికి ఆమె అధ్యక్షురాలుగా వ్యవహరించారు. అనేక ప్రాంతాలు పర్యటించి, భాధితులకు తక్షణ సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు.

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. అప్పటికి మహిళలకు ప్రత్యేకమైన జైళ్ళు లేకపోవడం, పలుకుబడి కలిగిన కుటుంబానికి చెందిన వారు కావడం మూలాన ఆమెను హయత్ నగర్ లోని బేగం గారి దేవిడిలో నకల సౌకర్యాలు కలిగిన రాజభవనంలో నిర్బంధించారు. దానికి ఆమె సంతోషించక తనతో పాటు అరెస్ట్ అయిన తక్కిన మహిళలకు ఎందుకు ఆ వసతులు కల్పించలేదని ప్రశ్నించారు. చైనా యుద్ధ సమయంలో ఆమె తనకున్న విలువైన బంగారు ఆభరణాలను నేషనల్ డిఫెన్స్ ఫౌండేషన్ కు సమర్పించారు. భారతదేశం నుండి " క్రమబద్ధమైన బ్రిటీష్ ఉపసంహరణ" కోరుతూ మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఖాదీ గురించి గాంధీ



సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసేందుకు, విదేశీ వస్తువులను బహిష్కరించడానికి కృషి సల్పారు.

పద్మజా నాయుడు భారత రాజ్యాంగ సభకు 1950 లో ఎన్నికై రెండేళ్ళు ఆ పదవిలో కొనసాగారు. ఆ తరువాత ఆమె 1956 నుండి 1967 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా తల్లితో పాటు పనిచేసిన పద్మజ, 21 యేళ్ల వయసులోనే హైదరాబాదులో భారత జాతీయ కాంగ్రెస్ సహ వ్యవస్థాపకురాలు అయ్యారు. స్వాతంత్ర్యానంతరం పద్మజా నాయుడు పార్లమెంటుకు ఎన్నికైనారు. కానీ అనారోగ్యం వల్ల రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తరువాత పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. అర్ధ శతాబ్దానికి పైగా ఉన్న ఆమె ప్రజా జీవితంలో, స్వచ్ఛంద సేవలో ఔత్సాహికురాలై, ఆమె మానవ సంక్షేమ నిర్దేశిత, అంతర్జాతీయ మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ తో సంబంధం కలిగి ఉండేది. బంగ్లాదేశ్ శరణార్థుల సహాయచర్య లప్పుడు భారత రెడ్ క్రాస్ సంస్థ చైర్ పర్సన్ గాను పని చేసి, ప్రముఖ పాత్ర పోషించారు. పద్మజా నాయుడుకు భారత్ సేవక్ సమాజ్, అఖిల భారత హస్తకళల బోర్డు, నెహ్రూ స్మారక నిధి వంటి సంస్థలతో అనుబంధం ఉండేది.

పద్మజ తన కవితా సంకలనం "ది ఫెదర్ ఆఫ్ డాన్" పేరుతో 1961లో ప్రచురించారు. 1975లో పద్మజా నాయుడు స్మృత్యర్థం డార్జిలింగులోని జంతు ప్రదర్శన శాలను పద్మజా నాయుడు హిమాలయ జంతు ప్రదర్శన శాలగా మార్చగా, నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రారంభోత్సవం చేశారు.

పద్మజా నాయుడు తన తల్లి (సరోజిని నాయుడు) నివాసం ది గోల్డెన్ థ్రెషోల్డ్‌ను 1970 లలో హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి (యుఒహెచ్) అప్పగించారు.

భారతజాతికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆమెకు పద్మవిభూషణ్ పురస్కారం లభించింది.

పద్మజా నాయుడు 1975 మే 2 న పరమపదించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# ఐక్య పోరాటాలకు సమయం ఆసన్నమైంది : ఎస్.రంగనాథ్



ఖమ్మం, మే1: కార్మిక సంఘాలు, కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని టీజీబీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.రంగనాథ్ అన్నారు. ఇల్లెందు సింగరేణి కార్మికుల సంఘం టీజీబీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకలో రంగనాథ్ పాల్గొని మాట్లాడారు. కార్మికుల త్యాగాలతో సాధించిన చట్టాలను, హక్కులను ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టి సంఘటిత, అసంఘటిత కార్మికుల కుటుంబాలతో చెలగాట మాడుతున్నాయన్నారు. ప్రధానమైన 29 కార్మిక చట్టాలను క్రోడీకరించి నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడానికి సన్నాహాలు చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పుడైనా ఐక్యంగా పోరాడకపోతే కార్మిక సమాజం క్షమించ దన్నారు.

అలాగే 130 సంవత్సరాల చరిత్ర గల బొగ్గుట ఇల్లెందు నాణ్యమైన బొగ్గు తీస్తూ ఎన్నో అవార్డులు తీసుకున్న చరిత్రను కాలరాసే ప్రయత్నం, రాజకీయ జోక్యం అధికమవడం వల్ల సింగరేణి అస్తవ్యస్తంగా మారిందన్నారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పూసపల్లి ఓపెన్ కాస్టును వెంటనే ప్రారంభించి. ట్రాన్స్ఫర్ అయిన కార్మికులను, ఇక్కడ ఉపాధి పొందుతున్న ఎందరో కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఇల్లెందులో మే డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే ఓసి ఇన్‌చార్జి ఎండీ షాకీర్, ఇల్లెందు ఏరియా టీబీజీకేఎస్ నాయకులు ముఖేష్ పాసి, రాసపల్లి శ్రీనివాస్, మహేష్ ,ఇమ్రాన్, గడ్డి శీను, ముత్యం పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో పడవ బోల్తా... ప్రాణనష్టంపై ప్రధానమంత్రి సంతాపం

న్యూఢిల్లీ, మే1: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో పడవ బోల్తా పడి ప్రాణనష్టం సంభవించడం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఈ విషాదకర సంఘటనలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధాన మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాధితులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను స్థానిక యంత్రాంగం అందిస్తోందని పేర్కొన్నారు.

ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేయనున్నట్లు, గాయపడిన వారికి రూ. 50,000 ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు.

''మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో పడవ బోల్తా పడటం వల్ల సంభవించిన ప్రాణనష్టం అత్యంత బాధాకరం. ఈ విషాదకర సంఘటనలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయ సహకారాలు అందిస్తోంది.

ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున నష్ట పరిహారం అందజేస్తున్నాం. గాయపడిన వారికి రూ. 50,000 అందజేస్తున్నాం: ప్రధానమంత్రి"

# హింస నిరోధంలో స్థానిక నాయకత్వం పాత్ర కీలకం





ఖమ్మం, మే1: హింస నిరోధంలో స్థానిక నాయకత్వం పాత్ర చాలా కీలకమని ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ శివనాదుల శ్రీనివాస్ అన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనల మేరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఖమ్మం రూరల్ మండల పరిషత్ కార్యాలయం నందు సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక నాయకులకు "సామాజిక నాయకత్వం, స్థానిక ప్రభావశీలు హింస నిరోధంలో నాయకుల పాత్ర " అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో హింస అనేది అందరి జీవితాలను దెబ్బ తీస్తోందన్నారు. సమాజాన్ని మార్చడానికి, సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

గ్రామాలలో, కాలనీలలో హింస నిరోధానికి స్థానిక న్యాయకత్వం ముందంజలో నిలబడాలన్నారు. వారు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి మహిళలు, పిల్లల హక్కుల గురించి చెప్పాలన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, బానిసత్వ కార్మికుల సమస్యలపై ఎన్‌జీఓలు, స్థానికులు కలిసి పోరాడాలని, గ్రామ ప్రథమ పౌరులుగా హింసను తిరస్కరించి ముందుకు సాగాలన్నారు. సమాజంలో ఐక్యత సృష్టించాలి ? గ్రామ సభలు, సమావేశాలలో చర్చలు నిర్వహించి తెలియజేయాలి. డయల్ 100, సైబర్ నేరాల కోసం 1930 లాంటి సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ఐ జ్యోతి, ఏ హెచ్ టి యు ? భాస్కర్, ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ కానిస్టేబుల్ రుక్మిణి, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

# నాలుగేళ్ల కొడుకును హత్తుకుని మరణించిన తల్లి



న్యూఢిల్లీ, మే1:మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ పరిధిలో గురువారం సాయంత్రం బోటు ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. బార్గి డ్యామ్ వద్ద నర్మదా నదిలో పడవ బోల్తా పడిన ఘటనలో 9 మంది మరణించారు. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వారి కోసం వెతుకుతుండగా గుండెలు పిండేసే దృశ్యం సహాయక బృందాల కంటపడింది. నాలుగేళ్ల తన కొడుకుని తల్లి హత్తుకుని మరణించింది. ఆ చిన్నారి కూడా తన తల్లిని పట్టుకుని ప్రాణాలు కోల్పోయాడు.

మరణంలోనూ తల్లీకొడుకు ఒకరినొకరు విడిచిపెట్టకుండా, చివరి క్షణం వరకు హత్తుకుని ఉండిపోయారు. ఒకరినొకరు పట్టుకుని ఉండిపోయిన తల్లీకొడుకు మృతదేహాలు నీటిలో తేలడం చూసిన సహాయక బృంద సభ్యులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రతి ఒక్కరినీ ఈ దృశ్యం కదిలిస్తోంది. గుండె బరువెక్కేలా చేస్తోంది. ఈ ఇద్దరితోపాటు వీరి కుటుంబానికి చెందిన మరో ఇద్దరు ఢిల్లీ నుంచి ఇక్కడికి విహార యాత్రకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి మృతదేహాల్ని రెస్క్యూ బృందాలు ఒడ్డుకు చేర్చాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 9 మంది మరణించారు. 16 మందిని అధికారులు రక్షించారు.

అయితే, ఎంతమంది ఇంకా గల్లంతయ్యారనేదానిపై స్పష్టత లేదు. ప్రమాదం జరిగిన సమయంలో బోటులో 40?45 మంది ఉన్నట్లు అంచనా. గల్లంతైన మిగతావారి కోసం సహాయక బృందాలు వెతుకుతున్నాయి. భారీ వర్షం, తుపాన్ కారణంగా బోటు బోల్తా పడినట్లు అధికారులు చెబుతున్నారు. తీరానికి 300 మీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో లోతు 20 అడుగులకుపైనే ఉంటుందని అంచనా. ప్రస్తుతం భారీ గజ ఈతగాళ్లు, డైవర్లు, భారీ యంత్రాల సాయంతో గల్లంతైన వారి కోసం వెతుకుతున్నారు. ఈ ప్రమాద ఘటనలో బోటు నిర్వాహకుల నిర్లక్ష్యం ఉందని అధికారులు అంటున్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని చెబుతున్నారు.

అలాగే, లైఫ్ జాకెట్లు కూడా ముందుగా ఇవ్వలేదు. పడవ బోల్తా పడుతున్న సమయంలో కొందరికి లైఫ్ జాకెట్లు అందించారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే స్థానికులే సహాయం అందించారు. వారు తాళ్లు, పైపులు అందించి వీలైనంత మందిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

# 57వ అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవ సంచాలకునిగా శ్రీ అశుతోష్ గోవారికర్ నియామకం

న్యూ ఢిల్లీ, మే1:గోవాలో జరగనున్న 57వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) సంచాలకునిగా ప్రముఖ చలన చిత్ర నిర్మాత శ్రీ అశుతోష్ గోవారికర్‌ను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నియమించింది.

శ్రీ గోవారికర్ భారతీయ సినిమాకు విశిష్టమైన సేవలందించిన ప్రముఖ చలనచిత్ర నిర్మాత. ఐఎఫ్ఎఫ్ఐతో ఆయనకు దశాబ్దాల అనుబంధం ఉంది. ఇది చలనచిత్ర కళల పరిణామం, అంతర్జాతీయ సినిమా సంస్కృతితో ఆయనకున్న ప్రగాఢ అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ నియామకం పట్ల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, శ్రీ గోవారికర్ ఇలా అన్నారు... "గోవాలో జరిగే ప్రతిష్ఠాత్మక 57వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవానికి ఫెస్టివల్ డైరెక్టర్‌గా సేవ చేయడం నాకు అపారమైన గౌరవాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. ఈ ఉత్సవ పరిణామక్రమాన్ని చూస్తుండడం నా అదృష్టం. 1984లో తొలిసారి ఈ ఉత్సవాలకు హాజరైనప్పటి నుంచి, 2024లో అంతర్జాతీయ సినిమాకు జ్యూరీ అధ్యక్షుడిగా పని చేసే వరకు దీనితో నా అనుబంధం కొనసాగుతూ వస్తోంది".

"1952 నుంచి దశాబ్దాలుగా ఎంతోమంది ఉత్సవ కమిటీ సభ్యులు రూపొందించిన, అభివృద్ధి చేసిన, విస్తరించిన ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లడం ఒక గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇప్పుడు ఈ నూతన బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతోనూ, గోవా ప్రభుత్వంతోనూ కలిసి సమన్వయంతో పనిచేయడానికి నేను ఆసక్తిగా ఎదురుచూ స్తున్నాను" అని ఆయన జోడించారు.

1952లో స్థాపించిన అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం... ఆసియాలోని ప్రముఖ చలనచిత్రోత్సవాల్లో ఒకటిగా నిలుస్తూ, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తూ, ప్రపంచ సినిమాలోని ప్రతిభను ప్రదర్శించే

# హెచ్ఎఫ్‌సీఎల్ రికార్డు ఫలితాలు

హైదరాబాద్, మే1: టెలికాం, డిజిటల్ మౌలిక వసతులు, రక్షణ రంగాల్లో ప్రముఖ టెక్నాలజీ సంస్థ హెచ్ఎఫ్సీఎల్ లిమిటెడ్ ఎఫ్వై26 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసింది. ఎఫ్వై25తో పోలిస్తే 21 శాతానికి పైగా ఆదాయ వృద్ధిని నమోదు చేయడంతో పాటు లాభాల మార్జిన్లలో కూడా గణనీయమైన పెరుగుదలను సాధించింది. కంపెనీ చరిత్రలోనే అత్యుత్తమ త్రైమాసిక ఫలితాలను కూడా నమోదు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార విస్తరణ, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు వంటి వ్యూహాల విజయవంతమైన అమలుతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఈ ప్రదర్శన ఒక కీలక మలుపుగా నిలిచింది. ఉత్పత్తి ఆధారిత వ్యాపార నమూనా, పెరుగుతున్న ఎగుమతులు, రక్షణ రంగాన్ని వేగంగా ఎదుగుతున్న విభాగంగా అభివృద్ధి చేయడం ద్వారా ఇప్పుడు మరింత బలమైన గ్లోబల్ సంస్థగా అవతరిస్తోంది.

ఈ సందర్భంగా హెచ్ఎఫ్సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ మహేంద్ర నహటా మాట్లాడుతూ ఈ ఏడాది కీలకమైన సంవత్సరంగా నిలిచిందన్నారు. ఈ ఏడాదిలో చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసి, ఆదాయంలో 21 శాతానికి పైగా వృద్ధి, పన్ను ముందు లాభంలో సుమారు 97 శాతం వృద్ధిని సాధించామన్నారు. మా ఆర్డర్ బుక్ గణనీయంగా పెరుగడమే కాకుండా, దాని వ్యాపార నిర్మాణంలో కూడా మెరుగుదల కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా ఎగుమతులు, దీర్ఘకాలిక ఒప్పందాలు, అధిక మార్జిన్ ఉత్పత్తుల వాటా పెరుగుతోందని పేర్కొన్నారు. ఆప్టికల్ ఫైబర్ ప్రీఫార్మ్‌లో బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్, రక్షణ రంగంలో విస్తరణ, ప్రపంచవ్యాప్తంగా వ్యాపార విస్తరణ, ఉత్పత్తి ఆధారిత వృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. ఇవన్నీ స్థిరమైన లాభాల పెరుగుదలకు మెరుగైన రాబడులకు బలమైన పునాది వేస్తున్నాయన్నారు. ఇప్పుడు ఒక గ్లోబల్, టెక్నాలజీ ఆధారిత, విభిన్న రంగాల్లో విస్తరించిన, స్థిరంగా లాభాలను అందించే సంస్థగా మారిందన్నారు. ఈ మార్పు రాబోయే సంవత్సరాల్లో స్థిరమైన ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుందని విశ్వసిస్తున్నామని తెలిపారు.

# మొక్క నాటిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్



ఖమ్మం, మే1:ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఇల్లెందు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె కేక్ కట్ చేసి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేన ఆధ్వర్యంలో మొక్క నాటారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేన ఖమ్మం అధ్యక్షుడు భాస్కర్ పవార్ మొక్క నాటి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధిలో పార్టీ విధానపరమైన పనుల్లో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిన కేసీఆర్ కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, జెకె శ్రీను, దేవీలాల్, మున్సిపల్ కౌన్సిలర్ పాబోల్ స్వాతి, మాజీ కౌన్సిలర్ తోట లలిత శారద, సర్పంచులు కుంజ సుకనయ్య, శంకర్, ప్రమోదు, రేణుక, నెమలి ధనలక్ష్మి, కొక్కు సరిత. నాయకులు చాంద్ పాషా, హరి ప్రసాద్ యాదవ్, గిన్నార రాజేష్, సత్తాల హరికృష్ణ, లక్ష్మీనారాయణ, కిరణ్, రాజు, నీలం రాజశేఖర్, భూక్య సురేష్, నివాస్, సురేష్ పాల్గొన్నారు.

# ఆఫ్‌లైన్ విస్తరణపై దృష్టి సారించాం- పాలసీబజార్ టర్మ్ ఇన్సూరెన్స్ హెడ్ వరుణ్ అగర్వాల్



హైదరాబాద్, మే1: వ్యక్తిగత బీమా సేవల కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఆఫ్‌లైన్ విస్తరణపై దృష్టి సారించామని పాలసీబజార్ టర్మ్ ఇన్సూరెన్స్ హెడ్ వరుణ్ అగర్వాల్ తెలిపారు. ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకునే సమయంలో కస్టమర్లు ప్రత్యక్ష సలహాల కోసం ఆసక్తి చూపిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025?26 ఆర్థిక సంవత్సరంలో ఆఫ్‌లైన్ చానెల్‌లను ఎంచుకునే కస్టమర్ల సంఖ్య 2.5 రెట్లు పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు ప్రతి దశలో సహాయం చేసేందుకు భౌతిక విస్తరణను వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ ఆఫ్‌లైన్ విస్తరణ వినియోగదారులలో స్పష్టమైన మార్పును ప్రతిబింబిస్తోందన్నారు. కస్టమర్లు ముందుగా ఆన్‌లైన్‌లో అన్ని పారదర్శకంగా పరిశీలిస్తారన్నారు. కానీ తదుపరి దశలో వారికి ప్రత్యక్షంగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసే వ్యక్తి అవసరం ఉంటుందన్నారు. ఈ విశ్వాసాన్ని పెంపొందించేందుకు డిజిటల్ సౌలభ్యాన్ని, వ్యక్తిగత ప్రత్యక్ష సేవలను కలిపి మా ఆఫ్‌లైన్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నామని తెలిపారు. 2025తో పోలిస్తే 2026 ఆర్థిక సంవత్సరంలో రిలేషన్‌షిప్ మేనేజర్ల సంఖ్య మూడు రెట్లు పెరిగిందన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com